# ప్రజా తపన
prajathapana.com
News that matters

సంపుటి :01 సంచిక: 62 బుధవారం 19 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద



# దేశంలో మండుతున్న ఎండలు

## జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనం

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**

ఆంధ్రప్రదేశ్ సహా దేశంలో పలు రాష్ట్రాల్లో మండుతున్న ఎండలతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కు చేరుకున్నాయి. మండే ఎండలతోపాటు వారం రోజులపాటు పలు రాష్ట్రాల్లోవేడిగాలులు వీస్తాయని భారత వాతావరణశాఖ మంగళవారం హెచ్చరించింది. హీట్ వేవ్ పరిస్థితుల కారణంగా పశ్చిమ బెంగాల్, త్రిపుర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను వారం రోజుల పాటు మూసివేయాలని ఆదేశించారు.గంగానది, పశ్చిమ బెంగాల్ బీహార్‌లో నాలుగు రోజుల పాటు వేడి తరంగాలు వీచవచ్చునని ఐఎండీ తెలిపింది. ఏప్రిల్ 18,19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో హీట్ వేవ్ పరిస్థితులు నెలకొంటాయని ఐఎండీ అంచనా వేసింది. సిక్కిం, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రెండు మూడు రోజుల్లో వేడిగాలులు వీచవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో వడ గాలులు వీచవచ్చు...ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ కోస్తా ప్రాంతాల్లో కూడా బుధవారం వరకు వేడిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు హీట్ వేవ్ హెచ్చరికలను శాస్త్రవేత్తలు జారీ చేశారు.రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలు,రాయలసీమ ప్రాంతంలో మంగళవారం

(మిగతా 2లో)

# గ్యాంగ్‌స్టర్లకు యూపీలో చోటు లేదు

**ప్రజా తపన ,లక్నో:**



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గ్యాంగ్‌స్టర్‌గా మారిన రాజకీయ నాయకుడు అతిక్ అహ్మద్ , అతని సోదరుడు హత్య చేయబడిన కొన్ని రోజుల తరువాత.. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రంలోని నేరస్థులు, గ్యాంగ్‌స్టర్‌లకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. లక్నోలో టెక్స్‌టైల్ పార్ట్ ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమంలో సీఎం యోగి మాట్లాడుతూ.. యూపీలో గ్యాంగ్‌స్టర్లు, నేరగాళ్లు ఎవరినీ బెదిరించలేరని , రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయని అన్నారు.అయితే మరోవైపు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కాల్చి చంపుతామని ఓ యువకుడు బెదిరించాడు. బాగ్‌పత్ జిల్లాకు చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో వేదికగా సీఎం యోగిని కాల్చి చంపుతానని హెచ్చరించాడు. ఆ యువకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కొందరు సీఎం, డీజీపీ, యూపీ పోలీసుల ట్విట్టర్ హ్యాండిల్స్‌లో ఈ పోస్ట్‌ను ట్యాగ్ చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి వెతకడం ప్రారంభించారు.

ప్రయాగ్‌రాజ్ జిల్లాలో అతిక్-అష్రాఫ్ హత్య కేసు తర్వాత, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు భద్రతను కట్టుదిట్టం చేశారు. రాజధాని లక్నోలో కూడా ముఖ్యమంత్రి నివాసం వెలుపల గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం యోగి భద్రతపై యూపీ పోలీసులు సీరియస్‌గా ఉన్నారు.ఫేస్‌బుక్ పోస్ట్ పై వెల్లువెత్తుతున్న అసంతృప్తి ఈ పోస్ట్‌ని చూసిన జనాలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. యూపీ డీజీపీ, పోలీసులను ట్యాగ్ చేయడంతో పాటు నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అతిక్ అహ్మద్ , అష్రఫ్ హత్య అనంతరం బాగ్‌పత్ నివాసి తన ఫేస్‌బుక్ ఖాతా

(మిగతా 2లో)




## సీబీఐ విచారణకు రండి

### ముందుస్తు బెయిల్ పిటీషన్ వాయిదా

**ప్రజా తపన ,హైదరాబాద్:**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ రేపటికి వాయిదా పడింది. ప్రశ్నించేందుకు రేపు పిలుస్తామని హైకోర్టుకు చెప్పింది సీబీఐ. బుధవారం ఉదయం 10.30 గంటలకు రమ్మంటామని హైకోర్టుకు తెలిపింది సీబీఐ. అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో కొనసాగుతున్న వాదనలు సాగాయి. ముందస్తు బెయిల్‌ను తీవ్రంగా

(మిగతా 2లో)

# సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

**ప్రజా తపన ,విజయవాడ:**



ఏపీలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ప్రొబేషన్ ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2020 నోటిఫికేషన్‌లో ఎంపికైన సిబ్బందికి పొబ్రేషన్ ఇస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. శాఖాపరమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతోపాటు, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ప్రొబేషన్ వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మే 1 నుంచి వారికి కొత్త పే స్కేళ్లు వర్తిస్తాయని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తెలిపింది.ప్రొబేషన్ ద్వారా సచివాలయ ఉద్యోగాలకు భద్రత ఏర్పడినట్టయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే సచివాలయ సిబ్బంది నియామకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. సచివాలయ సిబ్బందిని క్రమబద్ధీకరించేందుకు వీలు కల్పించే ప్రొబేషన్ డిక్లరేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆమోదం తెలిపింది.గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 19 రకాల కేటగిరీ ఉద్యోగులు పని చేస్తుండగా, ప్రొబేషన్ ఖరారైన గ్రేడ్?5 పంచాయతీ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల పే?స్కేలును రూ.23,120 ? 74,770గా నిర్ధారించారు. వీరి వేతనం డీఏ, హెచ్ఆర్ఏ కలుపుకుని రూ.29,598 ఉంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. మిగిలిన 17 రకాల కేటగిరి ఉద్యోగుల పే?స్కేలును రూ. 22,460? 72,810గా నిర్ధారించారు. అంటే, ఆ కేటగిరి ఉద్యోగుల డీఏ, హెచ్ఆర్ఏ కలుపుకొని రూ.28,753 ఉంటుంది.నిబంధనల ప్రకారం రెండేళ్ల సర్వీసు పూర్తి, డిపార్టెంట్ టెస్టు ఉత్తీర్ణత, ఎటువంటి నేర చరిత్ర లేదన్న పోలీసు రిపోర్టులకు అనుగుణంగా జిల్లాల కలెక్టర్లు ప్రొబేషన్ ఖరారుకు అర్హులైన ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేశారు. ఇందుకు అనుగుణంగా 19 రకాల కేటగిరి ఉద్యోగులకు సంబంధించి ఆయా జిల్లాల్లో కేటగిరీ వారిగా అర్హుల పేర్లతో కూడిన జాబితాలతో వేర్వేరుగా ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

# అతిక్ అహ్మద్ హత్య కేసు సుప్రీం విచారణ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**



గ్యాంగ్ స్టర్, మాజీ ఎంపీ అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రఫ్ అహ్మద్ శనివారం రాత్రి హత్యకు గురయ్యారు. పోలీస్ కస్టడీలో వైద్యపరీక్షల నిమిత్తం వచ్చిన ఇద్దరిని ముగ్గురు వ్యక్తులు జర్నలిస్టులుగా నటిస్తూ అతిదగ్గర నుంచి కాల్చి చంపారు. ఈ హత్య ఉత్తర్ ప్రదేశ్ తో పాటు యావత్ దేశంలో చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షాలు సీఎం యోగి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టాయి. యూపీ ఎన్కౌంటర్ రాజ్ గా మారిందని సమాజ్ వాదీ

(మిగతా 2లో)

# ఎన్సీపీకి అజిత్ పవార్ బిగ్ షాక్

## 30మంది ఎమ్మెల్యేలతో బీజేపీ తీర్థం?

**ప్రజా తపన ,ముంబయి:**



మహారాష్ట్రలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) కి చెందిన అజిత్ పవార్ 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో బీజేపీ చేరనున్నారని వార్తలు సంచలనం రేపాయి. మంగళ వారం అజిత్ పవార్ ముంబయి లో ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటు చేయనున్నారని సమాచారం .30 నుంచి 34 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు అజిత్ పవార్ బాటలో పయనించేందుకు వీలుగా బీజేపీ తీర్థం తీసుకోనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తిరుగుబాటు శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒక సంవత్సరం లోపే ఎన్సీపీ నేత అజిత్ పవార్ బీజేపీలో చేరనుండటం కలకలం రేపుతోంది. రాబోయే రోజుల్లో తమ నాయకుడు అజిత్ పవార్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆయనకు విధేయులుగా ఉంటామని ఎన్సీపీ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.కాగా శివసేన నాయకుడు

(మిగతా 2లో)

ప్రజా తపన
prajathapana.com
News that matters

# గుంతకల్ రైల్వేజోన్ ఏర్పాటు చెయ్యాలి

**గుంతకల్ రైల్వేజోన్ సాధన సమితి నాయకులు**

**ప్రజా తపన ,గుంతకల్ :**



డి ఆర్ ఎం అఫిస్ దగ్గర నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేశారు సమావేశంలో అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మొన్న రైల్వే శాఖ సహాయ మంత్రి రావు సాహెబ్ పాటిల్ దన్వే కు గుంతకల్ రైల్వేజోన్ ఏర్పాటు ఆవశ్యకత గురించి విశాఖపట్నం తో పోలిస్తే గుంతకల్ లో ఉన్న అవకాశం గురించి సమగ్రంగా వివరించి నివేదిక అందజేసాం అన్నారు.
మంత్రి కార్యాలయం వారు స్పందిస్తూ మీ వినతిపత్రం అందింది దానిపై సానుకూలంగా చర్యలు తీసుకుంటాం అని స్పందన తెలిపారు. గుంతకల్ డివిజన్ అత్యధిక ఆదాయం మాత్రమే కాక విశాలమైన భూమి రైల్వేజోన్ ఏర్పాటు కు పూర్తిస్థాయి వసతులు గుంతకల్ లో ఉన్నాయి అన్నారు.విశాఖపట్నం ఇప్పటికే దేశంలో అభివృద్ధి చెందిన నగరాల్లో తొమ్మిదవ స్థానంలో ఉంది అక్కడ ఇప్పటికే రాజధాని ప్రకటించారు.కనుక అత్యంత వెనకబడిన జిల్లా దేశంలోనే అత్యల్ప వర్షపాతం లో రెండవ స్థానం అనంతపురం జిల్లా ఉంది.ఇక్కడ ఉపాదిలేక వలసలు పోతుంటారు కనుక రైల్వేజోన్ ఇస్తే అన్న ప్రత్యక్షంగా పరోక్షంగా వేళల్లో ఉద్యోగాలు వచ్చి ఉపాధి దొరికే అవకాశం ఉంది కనుక వెంటనే
గుంతకల్ కు రైల్వేజోన్ ఇవ్వాలన్నారు.
ఈ కార్యక్రమంలో గుంతకల్ రైల్వేజోన్ సాధన సమితి నాయకులు వై.రాజశేఖర్ రెడ్డి,గుర్రం సూర్యనారాయణ, రమేష్, జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు, సీతారాం, కాశి రావు,గురుసంకర్ తదితరులు పాల్గొన్నారు

# కైలా హేమబాంధవికి డాక్టరేట్

**ప్రజా తపన ,**



మొవ్వ మండలం యద్దనపూడి గ్రామానికి చెందిన కైలా హేమబాంధవికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ డాక్టరేట్ ప్రధానం చేసింది.ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో అసోషియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డా బూసి వెంకటస్వామి పర్యవేక్షణలో కృష్ణా జిల్లా దివిసీమ జానపద కళారూపాలు- ఒక పరిశీలన అనే అంశంపై కైలా హేమబాంధవి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగానికి సమర్పించిన సిద్ధాంతగ్రంధానికి గాను డాక్టరేట్ లభించినట్లు ఆమె తెలియ జేసారు. తాను చిన్నప్పటి నుండి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదువుకున్నానని, గ్రామీణ నేపధ్యం నుండి వచ్చిన తనకు జానపద కళల మీద మక్కువ ఎక్కువని అందుకే దివిసీమ జానపద కళారూపాలపై పరిశోధన చేసి నట్లు తెలియజేసారు.తను ఈ స్థాయికి రావటానికి కారణభూతులైన తల్లి దండ్రులకు, గురువులకు కృత్తతలు తెలియజేసారు.

# దేశంలో మండుతున్న ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

38 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మహారాష్ట్రలో వడదెబ్బకు 11 మంది మృతి మహారాష్ట్ర ఈవెంట్‌లో 11 మంది వడదెబ్బతో మరణించారు.ఢిల్లీ, పంజాబ్, హర్యానాలో ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. ఢిల్లీలో, హీట్ వేవ్ పరిస్థితులు వరుసగా రెండవ రోజు కొనసాగాయి. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో గరిష్ట ఉష్ణోగ్రత 40.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది సాధారణం కంటే నాలుగు డిగ్రీలు ఎక్కువ. దేశ రాజధానిలో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదవడం ఇది వరుసగా మూడో రోజు.పంజాబ్, హర్యానాలలో కూడా వేడి వాతావరణ పరి స్థితులు నెలకొన్నాయి.హర్యానాలో, హిస్సార్‌లో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వేడిగాలులు వ్యాపించాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.రాజస్థాన్‌లోని చురులో అత్యధికంగా 42.2 డిగ్రీల సెల్సియస్, బన్స్వారాలో 42.1 డిగ్రీలు, కరౌలీలో 41.4 డిగ్రీలు, అల్వార్‌లో 41.9 డిగ్రీలు, కోటాలో 41.2 డిగ్రీలు, పిలానీలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

# గ్యాంగ్‌స్టర్లకు యూపీలో చోటు లేదు

(మొదటిపేజీ తరువాయి)

నుండి సీఎం ను చంపేస్తానని పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్‌లో సీఎం యోగి ఫోటోను పోస్ట్ చేస్తూ 'నా వైపు చూడకు బ్రదర్, నేనేమీ చేయలేదు' అని కామెంట్ జత చేశాడు.సీఎం యోగిపై అనుచిత పదాలు వాడారు ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ప్రజలు కామెంట్ చేయడం ప్రారంభించారు. అమన్ రాజ్ అనే యువకుడు సీఎం యోగిని అసభ్య పదజాలంతో దూషించాడు. అలాగే సీఎం యోగిని కాల్చిచంపుతానని హెచ్చరించాడు. అమన్ రాజ్ అనుచిత మాటలపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అమన్ రాజ్ వ్యాఖ్యను చూసిన నితిన్ తోమర్ యూపీ డీజీపీ, బాగ్‌పత్ పోలీసులను ట్యాగ్ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిందితుడు యువకుడు పరారీలో ఉండడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు అదే సమయంలో, ఈ పోస్ట్‌పై బాగ్‌పత్ పోలీసులు చర్యలు చేపట్టారు. బాగ్‌పత్ పోలీసులు సైబర్ సెల్‌ను దర్యాప్తు చేయాలని కోరారు. అలాగే నిందితుడు అమన్ రాజ్‌పై ఐపీసీ సెక్షన్ 507, ఐటీ చట్టంలోని సెక్షన్ 66 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ప్రస్తుతం నిందిత యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడి కోసం పోలీసులు వెతుకుతున్నారు.2017కు ముందు ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు అధ్వాన్నంగా ఉన్నాయని, అల్లర్లతో రాష్ట్రం అపఖ్యాతి పాలయ్యిందని అన్నారు. అయితే 2017 నుండి 2023 వరకు ఉత్తరప్రదేశ్‌లో మతపరమైన హింసాకాండ జరగలేదు. ఈ కాలంలో రాష్ట్రంలో కర్ఫ్యూ విధించబడలేదు. ఇప్పుడు ఒక క్రిమినల్ లేదా మాఫియా ఏ వ్యాపారవేత్తను బెదిరించలేరు. యుపిలో ఇప్పుడు శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయి' అని ఆదిత్యనాథ్ అన్నారు.అతిక్ అహ్మద్ మరియు అతని సోదరుడు అష్రఫ్‌లను వైద్య పరీక్షల కోసం ప్రయాగ్‌రాజ్‌లోని ఆసుపత్రికి తీసుకువెళుతుండగా ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపిన మూడు రోజుల తర్వాత ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. హత్యలపై విచారణ జరిపేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు సభ్యుల జ్యుడీషియల్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. రెండు నెలల్లో నివేదికను సమర్పించనుంది. అహ్మద్ సోదరుల హత్యపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా ఏర్పాటుచేశారు.

# సీబీఐ విచారణకు రండి

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించింది సీబీఐ. అవినాశ్ రెడ్డి నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉందని వాదించింది సీబీఐ. వివేకా హత్య వ్యవహారం అవినాశ్ రెడ్డికి ముందే తెలుసని.. వివేకా హత్య జరిగిన రోజు అవినాశ్ రెడ్డి తన ఫోన్ విపరీతంగా వాడారని అంటోంది సీబీఐ. గతంలో జరిపిన నాలుగు విచారణల్లో అవినాశ్ సహకరించలేదని ఆరోపించింది సీబీఐ.
అవినాశ్ ప్రమేయంపై మా దగ్గర ఆధారాలు ఉన్నాయని తెలిపింది. అవినాశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌లో ఇంప్లీడ్ అయిన వివేక కుమార్తె సునీత.. ఎప్పుడు నోటీసిచ్చినా అవినాశ్ రెడ్డి కోర్టును ఆశ్రయిస్తున్నారని సునీత న్యాయవాది వాదించారు. విచారణను అడ్డుకోవడానికి అవినాశ్ రెడ్డి ప్రతీసారి ప్రయత్ని స్తున్నారని. . కేసు విచారణ ఏపీ నుంచి తెలం గాణకు మార్చడానికి కారణం అవినాశ్ రెడ్డి అని వాదించారు సునీత తరపు న్యాయవాది. ఏపీలో పలుకుబడి ఉపయోగించి విచారణను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.వివేక హత్య కు కారణం ఏమైె ఉండొచ్చని అవినాష్ న్యాయవాదిని ప్రశ్నించింది హై కోర్టు. గతంలో అవినాష్ రెడ్డి నాలుగు సార్లు ప్రశ్నించగా, అందుకు ఆయన సహకరించలేదని సీబీఐ తరపు న్యాయవాదులు తెలిపారు. కాబట్టి, అవినాష్ రెడ్డి నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉందని, ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వవద్దని కోర్టును కోరారు. వివేకా హత్య జరిగిన రోజు ఉదయం అవినాష్ రెడ్డి జమ్మలమడుగుకు దగ్గర్లో తాను ఉన్నట్లు చెప్పారు. కానీ, మొబైల్ సిగ్నల్స్ చూస్తే ఆయన తన ఇంట్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఆ రాత్రంతా తన ఫోన్‌ను ఎక్కువగా వినియోగించినట్లు సాంకేతికంగా గుర్తించామని కోర్టుకు చెప్పారు. వివేకా హత్య కుట్ర అవినాష్ రెడ్డికి ముందే తెలుసని చెప్పారు. విచారణలో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను తాము సేకరించామని, అసలు వివేకా హత్యను గుండె పోటుగా ఎందుకు చెప్పాలను కున్నారో తెలియాలని కోర్టులో వాదనలు వినిపించారు.జూ వివేకానందరెడ్డి హత్య జరిగి 4 ఏళ్లు గడిచాయి.! నాలుగేళ్ల కాలంలో ఈ కేసు దర్యాప్తులో లెక్కలేనన్ని ట్విస్టులు. సుప్రీం కూడా జోక్యం చేసుకోవడంతో విచారణను మరింత వేగవంతం చేసింది అఃఎ. ఇన్వెస్టిగేషన్ తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో.. ఆరోపణలు, ప్రత్యారోపణలు తారస్థాయికి చేరుకున్నాయి. అనేక కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి.జడ్జ్ ప్రశ్నకు అవినాష్ న్యాయవాది పలు కీలక అంశాలపైనే సమాధనం ఇచ్చారు. ఇందులో 1. ఫ్యామిలీ గొడవలు, 2. ల్యాండ్ వివాదం, 3. అక్రమ సంబంధాలు అయి ఉండొచ్చు. 4. పొలిటికల్ వివాదం కారణం కావచ్చు. సునీతారెడ్డి తీరుపై అనేక ప్రశ్నలు సంధించడమే కాదు.. మరెన్నో అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు ఎంపీ అవినాష్‌రెడ్డి.

# అతిక్ అహ్మద్ హత్య కేసు సుప్రీం విచారణ

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ, బీఎస్పీ వంటి పార్టీలు బీజేపీని విమర్శించాయి.ఈ ఘటనపై సుప్రీం కోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ ఎంక్వైరీ జరిపించాలని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 24న దీనిపై విచారణ చేసేందుకు అంగీకరించింది.రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి నేతృత్వంలోని జ్యుడీషియల్ కమిటీతో దర్యాప్తు చేయాలని కోరుతూ, 2017 నుంచి ఉత్తర్ ప్రదేశ్ లో జరిగిన 183 ఎన్‌కౌంటర్లపై కమిటీ విచారణ జరిపించాలని పిటిషనర్ న్యాయవాది విశాల్ తివారీ కూడా కోరారు. ఇదే కాకుండా గ్యాంగ్ స్టర్ వికాస్ దూబే ఎన్‌కౌంటర్‌పై కూడా సీబీఐ చేత దర్యాప్తు చేపట్టాలని పిటిషనర్ కోరారు. ఈ హత్యకేసును సీబీఐకి బదిలీ చేయాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ పిటిషన్ దాఖలు చేశారు.

# ఎన్సీపీకి అజిత్ పవార్ బిగ్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ రౌత్ ఆదివారం ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ ఇటీవల ఉద్ధవ్ ఠాక్రేతో కలిసినపుడు తమ పార్టీ ఎప్పటికీ బీజేపీతో చేతులు కలపదని చెప్పినట్లు సమాచారం.ఇటీవల ఎంఎస్‌సీ బ్యాంక్ కుంభకోణం కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జ్ షీటులో అజిత్ పవార్, అతని భార్య సునేత్రల పేర్లను తొలగించింది.ఇతర నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ఛగన్ భుజబల్, ధనంజయ్ ముండేతో సహా ప్రముఖులు అజిత్ పవార్ ఉద్దేశాలను సమర్థించారని సమాచారం. అయితే రాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడు జయంత్ పాటిల్, ఆ పార్టీ నేత జితేంద్ర అవద్ మాత్రం బీజేపీతో చేతులు కలపడాన్ని ఇష్టపడడం లేదు.కొంతమంది అజిత్ క్యాంపు ఎమ్మెల్యేలు ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను కలిశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో అజిత్, ఇతర ఎన్‌సీపీ నాయకులతో కలసి వస్తే, అది మహారాష్ట్రలో ఎన్‌డీఏకు క్లీన్ స్వీప్ అవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అధికార పార్టీలో చేరడం వల్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేడిని ఎదుర్కొంటున్నందున అజిత్, అతని కుటుంబం, ప్రఫుల్ పటేల్, హసన్ ముష్రిఫ్ వంటి అనేక మంది ప్రతిపక్ష నాయకులు వారికి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఉపశమనం లభించవచ్చని రాజకీయ వర్గాలు అంటు న్నాయి. అధికార పార్టీతో చేతులు కలపడం వల్ల వారి నియోజకవర్గాలకు అధిక నిధులు వస్తాయి,దీంతో తదుపరి ఎన్నికల్లో వారి నియోజకవర్గాల్లో తమకే ఆధిక్యత లభిస్తోందని వారు భావిస్తున్నారు.శరద్ పవార్ లేకపోతే ఈ చర్య ఫలించదని చాలా మంది ఎమ్మెల్యేలు భావి స్తున్నారు. శరద్ పవార్ తనకు మద్దతివ్వకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని అజిత్ పవార్ భయపడుతున్నారు.మొత్తం మీద మహారాష్ట్ర రాజకీయం మహా రసవత్తరంగా మారింది.

# సుప్రీం కోర్టులో రామోజీరావుకి షాక్

**న్యూఢిల్లీ**

ఈనాడు గ్రూపుల అధినేత రామోజీరావుకు సుప్రీంకోర్టు చుక్కెదురయింది. మార్గదర్శి కేసుపై విచారణ జరిగింది. డిపాజిటర్లందరికీ చెల్లింపులు చేశామని మార్గదర్శి లాయర్ కోర్టుకు విన్నవించారు. చెల్లింపులు చేశాక డిపాజిటర్ల సమాచారం బయట పెట్టడానికి ఇబ్బంది ఏంటని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వాదించారు. ఉండవల్లి వాదనతో ఏకీభవించిన సుప్రీం కోర్టు, డిపాజిట్ దారుల వివరాలు బయటపెట్టాలని ఆదేశించింది.

# 20 ఏళ్లలో 1000 శాతం పెరిగిన బంగారం

**ముంబై:**

ఈ నెల 22న, శనివారం నాడు వచ్చిన అక్షయ తృతీయ ఒక పవిత్రమైన పండుగ. అక్షయ తృతీయ నాడు బంగారంలో పెట్టుబడి పెట్టడం చాలా శుభప్రదంగా హిందువులు భావిస్తారు. ప్రతి ఒక్కరు తమ బడ్జెట్‌కు అనుగుణంగా, కనీసం ఒక్క గ్రాము బంగారం అయినా అక్షయ తృతీయ నాడు కొనడానికి ప్రయత్నిస్తారు. గత కొన్ని నెలలుగా, బంగారంపై పెట్టుబడి పెట్టిన వాళ్లకు విపరీతమైన రాబడిని తిరిగి వచ్చింది. అయితే, 20 ఏళ్ల క్రితం, అంటే 2003లో అక్షయ తృతీయ నాడు బంగారం ధర ఎంత ఉందో మీకు తెలుసా?2003లో, అక్షయ తృతీయ పండుగను మే నెల 4వ తేదీన జరుపుకున్నారు. ఆ రోజు, 10 గ్రాముల బంగారం ధర రూ. 5,656 గా ఉంది. ఇప్పుడు, 2023లో, అక్షయ తృతీయ పండుగకు ముందే 10 గ్రాముల పసిడి రేటు రూ. 60,560 గా ట్రేడవుతోంది. ఈ 20 ఏళ్లలో బంగారం ధర 10 గ్రాములకు ఏకంగా రూ. 54,900 పెరిగింది. అంటే, రెండు దశాబ్దాల్లో ఏళ్లలో బంగారం ధర 1000 శాతం లేదా 10 రెట్లు పెరిగింది. 20 ఏళ్ల క్రితం అక్షయ తృతీయ నాడు లక్ష రూపాయల విలువైన బంగారాన్ని కొనుగోలు చేసి ఉంటే దాని విలువ ఇప్పుడు రూ.10 లక్షల వరకు పెరిగి ఉండేది.బంగారం మాత్రమే కాదు, వెండి ధర కూడా ఈ 20 ఏళ్లలో 900 శాతం పెరిగింది. 2003 మే 4వ తేదీన కిలో వెండి రూ. 7,550 వద్ద ట్రేడయింది. ఇప్పుడు, కిలో వెండి రూ. 76,200 వద్ద ఉంది. ఈ రెండు దశాబ్దాల్లో కిలో వెండి ధర రూ. 68,650 మేర పెరిగింది. శాతాల వారీగా చూస్తే.. 20 ఏళ్లలో



వెండి ధర 900 శాతానికి పైగా పెరిగింది.20 ఏళ్ల క్రితానికి వెళ్లకుండా, కేవలం ఒక్క సంవత్సరం వెనుదిరిగి చూసినా బంగారం ధర ఆశ్చర్యపరుస్తుంది. 2022లో, అక్షయ తృతీయ నాడు 10 గ్రాముల బంగారం ధర రూ. 50,808గా ఉంది. గతేడాది అక్షయ తృతీయ నుంచి ఇప్పటి వరకు బంగారం ధర 19.20 శాతం లేదా 10 గ్రాములకు రూ. 9,760 పెరిగింది. బంగారం ధరల పరుగు ఇప్పుడప్పుడే ఆగదన్నది నిపుణుల అభిప్రాయం. అతి త్వరలోనే 10 గ్రాముల పసిడి ధర 10 గ్రాములకు రూ. 65,000 స్థాయిని తాకవచ్చని అంచనా.ఆభరణాలు, కడ్డీలు, నాణేల రూపంలో బంగారాన్ని కొనుగోలు చేయడం అనేది సాధారణంగా బంగారంలో పెట్టుబడి పెట్టడానికి ప్రజలు ఇష్టపడే మార్గం. కానీ, ఊూ, మేకింగ్ ఛార్జీలు వంటివి ఉంటాయి కాబట్టి ఇది ఖర్చుతో కూడుకున్న మార్గం. అంతే కాకుండా, షాపు వాళ్లు మనకు అమ్మే బంగారం స్వచ్ఛత గురించి ఆందోళన కూడా ఉంటుంది. ఇంట్లో కాస్త ఎక్కువ బంగారం ఉందంటే, దొంగల భయంతో సరిగా నిద్ర కూడా పట్టని రోజులివి. ఈ అదనపు ఖర్చు, ఆందోళనలకు విరుగుడుగా... బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఫిజికల్ గోల్డ్ మాత్రమే కాకుండా ఇతర ఎంపికలు కూడా అందుబాటులో ఉన్నాయి. అవి.. గోల్డ్ ఇఊఊలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ లేదా సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఊః), డిజిటల్ గోల్డ్. స్వచ్ఛత, నిల్వ, ఇతర ఛార్జీల గురించి ఆందోళన చెందకుండా, వీటిలో నిర్భయంగా పెట్టుబడి పెట్టవచ్చు

# తారక రామమందిరం ఐడియా మార్చేస్తుందా

**గన్నవరం:**

తెలుగుదేశం పార్టీలో గన్నవరం రాజకీయం రంజుగా మారబోతోంది. పాత నాయకులందర్నీ ఎకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. ఇందుకు తారక రామ మందిరం ప్రారంభం వేదిక కాబోతోందని తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారు. నందమూరి, నారా కుటుంబాలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చేందుకు తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో మాజీ శాసన సభ్యుడు దాసరి బాలవర్ధనరావు కీలక అడుగులు వేశారు. 2019 తరువాత వైసీపీకి దగ్గరయిన దాసరి బాలవర్ధనరావు, దాసరి జైరాం రమేష్ ఇప్పుడు తిరిగి టీడీపికి దగ్గరయ్యారు. తారక రామ మందిరం ఉంగుటూరు మండలం ఉంగుటూరులో నిర్మిస్తున్నట్లు స్వయంగా దాసరి బాలవర్ధనరావు తెలిపారు. రామారావు, బసవతారకం విగ్రహాలు ఏర్పాటు చేసి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవం చేయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గన్నవరం, గుడివాడ శాసన సభ స్థానాలను తిరిగి టీడీపీ దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చంద్రబాబు, బాలకృష్ణ, పురంధేశ్వరి సహా ఎన్టీఆర్ ఇతర కుటుంబ సభ్యులు అందర్నీ ఆహ్వానిస్తున్నామని దాసరి బాలవర్ధనరావు తెలిపారు.గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధన రావు మాట్లాడుతూ.... దివంగత నేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ సీనియర్ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో తమకు అనుబంధం ఉందన్నారు. తారక రామ మందిరం ఉంగుటూరు మండలం ఉంగుటూరులో నిర్మిస్తున్నామని, రామారావు, బసవతారకం విగ్రహాలు ఏర్పాటు చేసి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు చేతులు మీదుగా త్వరలో ప్రారంభోత్సవం చేయిస్తామని తెలిపారు.చంద్రబాబు, బాలకృష్ణ, పురంధేశ్వరి, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు అందరకి ఆహ్వానిస్తున్నామని, వారి చేతులు మీదుగా విగ్రహ ఆవిష్కరణ జరగుతుందన్నారు. తన మీద అభిమానంతో తెలుగు దేశం నాయకులు తన ఫొటోతో ఫ్లక్సీ లు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. 2019 లో రాజకీయ పరిణామాలు వలన తనతో పాటుగా దాసరి జై.రమేష్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళామని తెలిపారు. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తమకు సభ్యత్వం కూడా లేదన్నారు. ఎన్నికల తరువాత వైఎస్ఆర్ సీపీలో ఎటువంటి కార్యక్రమాల్లో కూడ పాల్గొనలేదన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండాలా లేదా అనేది సోదరుడు జై రమేష్ తో కలసి ఆలోచన చేస్తామన్నారు దాసరి బాలవర్ధనరావు.తెలుగు దేశం పార్టీ నేతలు గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. రాష్ట్రంలో అధికారంలోకి రావటంతో పాటుగా గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో తిరిగి పార్టీ జెండాను ఎగర వేయాలన్నదే లక్ష్యంగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో ఉన్న శాసన సభ్యులు వల్లభనేని వంశీ, కొడాలి నానిలను ఎట్టి పరిస్దితుల్లో ఓడించటమే లక్ష్యంగా తెలుగు దేశం ప్రయత్నాలు మెదలుపెట్టింది. అందులో భాగంగానే గన్నవరానికి చెందిన మాజీ నేతలను తిరిగి పార్టిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించటంతో పాటుగా, పార్టీకి గెలిపించటమే అంతిమ లక్ష్యంగా పెట్టుకుంది. దాసరి బాలవర్దనరావు, దాసరి జైరాం రమేష్ ఇద్దరు కీలక నేతలు గతంలో తెలుగు దేశం పార్టిలో గన్నవరం నుండి కీలకంగా వ్యవహరించారు. అయితే కాలక్రమంలో ఇరువురు నేతలు, పార్టీని వీడి దూరం అయ్యారు. ఇప్పుడు తిరిగి ఆ ఇద్దరు నేతలను పార్టిలోకి తీసుకువచ్చి, కార్యకలాపాలను వేగవంతం చేస్తోంది తెలుగు దేశం.గన్నవరం, గుడివాడలో తెలుగు దేశం తిరిగి విజయం సాధించేందుకు అవసరం అయిన అన్ని వనరులను సమీకరిస్తున్నారు. అందులో భాగంగానే నందమూరి, నారా ఫ్యామిలీలను ఈ నియోజకవర్గంలో జరిగే ఎన్టీఆర్ మందిరం ప్రారంభానికి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, గుడివాడ శాసన సభ్యుడు కొడాలి నాని, నందమూరి, నారా కుటుంబాల మద్య విభేదాలపై ఇష్టానుసారంగా కామెంట్స్ చేసిన నేపథ్యంలో ఆరెండు కుటుంబాలు, పార్టీ తరపున ఒకే వేదిక పైకి తీసుకువస్తే, మొత్తం వ్యవహారం టీడీపీకి అనుకూలంగా మారుతుందని భావిస్తున్నారు.

# వివాదంలో కనకదుర్గప్రభ

**విజయవాడ:**

మ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ.. చాల పెద్దమ్మ.. కనకదుర్గమ్మ ఆలయం ఎప్పుడూ వివాదాల్లో ఉంటుంది. అధికారుల తీరు వల్ల భక్తులకు అనేక ఇబ్బందులు కలుగుతుంటాయి. తాజాగా ఓ మేగజైన్ కథనం వివాదానికి ఆజ్యం పోసింది. అద్వైత వేదాంత సిద్దాంతాన్ని ఏకీకృతం చేసిన భారతీయ తత్వవేత్త, వేదాంతవేత్త అయిన ఆది శంకరాచార్యులు గురించి ప్రచురించిన కథనం ఆధ్యాత్మిక వర్గాలను ఆగ్రహానికి గురిచేస్తోంది. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీకనకదుర్గ గుడి ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గ ప్రభ మాసపత్రిక ప్రచురించబడుతుంది. ఈ మాసపత్రికకు దుర్గగుడిలోని ఉద్యోగి ఎడిటర్ గా విధులు నిర్వర్తిస్తాడు. ఆలయంలో పనిచేస్తున్న గంగాధర్ ఏప్రిల్ నెలకు సంబంధించి ప్రచురించిన పుస్తకంలో ఆది శంకరాచార్యులు గురించి కథనం వ్రాసారు.. ఈ కథనం ఇప్పుడు దుమారం రేపుతుంది.ఆది శంకరాచార్యులు గోదావరి నదీతీర ప్రాంతపర్యటనలో శంకరులు సంచారం చేసినప్పుడు మీరు ఎవరు? మీ పుట్టుపూర్వోత్తరాలు ఏంటి ? అని కొందరు అడిగిన సమయంలో శంకరులు తన పేరు శంకరాచార్య, త్వష్ట విశ్వబ్రాహ్మణ వంశంలో జన్మించాను అంటూ ఈ విధంగా సమాధానం చెప్పారని విదేశీయుడైన రచయిత శంకర విజయలో అల్ఫ్రెడ్ ఎడ్వర్ట్ రాబర్ట్స్ తెలియజేశారంటూ ప్రచురించారు.బ్రాహ్మణ వంశానికి చెందిన శంకరాచార్యులను విశ్వబ్రహ్మణ వంశానికి చెందిన వారిగా ప్రచురించడంపై ఆధ్యాత్మిక వర్గాలు మండిపడుతున్నాయి.ఈ కథనంపై ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందిన నేపధ్యంలో ఆలయ ఈవోను విచారణ చేయాలని ఆదేశించారు. ఆలయ ఈవో విచారణ అనంతరం శ్రీకనకదుర్గ ప్రభ మాసపత్రిక కు ఎడిటర్ గా విధులు నిర్వర్తిస్తున్న గంగాధర్ కు నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు త్రిసభ్య కమిటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో భ్రమరాంబ తెలిపారు. ఈ త్రిసభ్య కమిటిలో ఆలయ పండితులు, అర్చకులు పరిశీలించిన తరువాతనే ప్రచురిస్తామంటూ వివరణ ఇచ్చారు.

# వివేకా కేసు క్లైమాక్స్ తో వేడెక్కిన రాజకీయం

**కడప:**

వైఎస్ భాస్కర్ రెడ్డి అరెస్ట్‌తో ఏపీ రాజకీయాలు వేడెక్కాయి. ఆదివారం ఉదయం పులివెందుల భాకరాపురంలో భాస్కర్ రెడ్డి అరెస్ట్ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. తాజా పరిణామాలు, సిబిఐ దూకుడుతో ముఖ్యమంత్రి తన పర్యటన రద్దు చేసుకున్నారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్ట్ అనివార్యమైతే రాజకీయంగా అది వైఎస్సార్సీపీకి ఇబ్బందికరం అవుతుంది.వివేకా హత్య కేసులో దర్యాప్తు అధికారిని సుప్రీం కోర్టు ఉత్తర్వులతో మార్చడంతో ఊపిరి తీసుకున్న వైసీపీ నాయకులకు ఆ సంతోషం ఎక్కువ రోజులు మిగల్లేదు. వివేకా హత్య కేసు లో అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులు హత్యకు ముందు తర్వాత భాస్కర్ రెడ్డి నివాసంలో ఉన్నట్లు సాంకేతిక ఆధారాలను సిబిఐ సేకరించింది. హత్య తర్వాత మృతదేహానికి ఉన్న గాయాలను కడిగేసి కట్లు వేసి గుండెపోటుగా ప్రచారం చేయడం వెనుక కీలక పాత్ర పోషించింది ఎవరనేది దర్యాప్తులో వెల్లడైంది. ఈ పరిణామాలు అన్నింటిలో ఎంపీ అవినాష్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు రావడంతో రాజకీయంగా దుమారం రేగింది.వివేకా హత్య కేసు దర్యాప్తు ఏకపక్షంగా సాగుతోందని అవినాష్ రెడ్డి మొదటి నుంచి ఆరోపిస్తున్నారు. హత్యకు పాల్పడిన నిందితుల్లో ఒకరి వాంగ్మూలం ఆధారంగా కేసు విచారణ జరుగుతోందని, వివేకా మరో మహిళను వివాహం చేసుకోవడం, ఆస్తుల వ్యవహారం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అవినాష్ ఆరోపిస్తున్నారు. వివేకా కుమార్తె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి పాత్రను విచారించాలని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. తాజాగా హైర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో సైతం సునీతకు వివేకా రెండో భార్యకు మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని ఆరోపించారు. వివేకా హత్య కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని ముందస్తు బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు.వివేకా హత్యకు సునీతతో రెండో భార్యకు తలెత్తిన విభేదాలే కారణమని అవినాష్ రెడ్డి ఆరోపించారు. రెండో భార్య షమీమ్‌కు ఆర్థిక భరోసా కల్పించేందుకు వివేకా నిర్ణయించడం, కుమారుడికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో అడ్మిషన్ ఇప్పించడం, స్కూల్ పరిసర ప్రాంతాల్లో విల్లాను కొని ఆ కుటుంబాన్ని అక్కడకు తరలించడం వంటివి చేయాలని నిర్ణయించుకోవడంతో సునీత కక్ష పెంచుకున్నారని అవినాష్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే హత్య జరిగిందని, అందులో తమ ప్రమేయం ఏమి లేదని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో అవినాష్ పేర్కొన్నారు.వివేకా కుమార్తె సిబిఐ, స్థానిక ఎమ్మెల్సీ, ప్రతిపక్ష నాయకుడి సహాయంతో వివేకా హత్య కేసులో తనను ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని అవినాష్ ఆరోపిస్తున్నారుమరోవైపు వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్ రెడ్డిని సిబిఐ అరెస్ట్ చేయడంతో సమస్య నుంచి గట్టెక్కడానికి పొలిటికల్ ఫిక్సర్లను ఆశ్రయించారని జోరుగా ప్రచారం జరుగుతోంది. మైసూరు సమీపంలో చామనగిరి ప్రాంతానికి చెందిన బ్లాక్ స్టోన్ కాంట్రాక్టర్, ఆస్ట్రాలజర్ ఆదివారం ప్రత్యేక విమానంలో విజయవాడ వచ్చినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.కర్ణాటకలో హై ప్రొఫైల్ ఆస్ట్రాలజర్‌గా గుర్తింపు పొందిన సదరు వ్యక్తిని తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ సహకారంతో విజయవాడ తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. హై ప్రొఫైల్ లాబీయిస్ట్‌గా పేరొందిన సదరు వ్యక్తి సహకారంతో ప్రస్తుత పరిణామాల నుంచి గట్టెక్కే ప్రయత్నాలు జరుగుతున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది.ఏపీకి చెందిన ప్రముఖ కాంట్రాక్టు సంస్థకు చెందిన ఎండి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. సదరు కాంట్రాక్టరు కుటుంబంలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో గతంలో ఉన్న విభేదాలను పక్కన పెట్టి ముఖ్యమైన వారికి దగ్గరైనట్లు చెబుతున్నారు. ఈ కేసు వ్యవహారంలో మున్ముందు తలెత్తే పరిణామాల తీవ్రతతను గణనీయంగా తగ్గించేందుకు లాబీయిస్టుల సహకారంతో ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.మరోవైపు వివేకా హత్య కేసు నీరుగార్చే క్రమంలో కొంతమంది ప్రత్యేక విమానంలో ఆదివారం ఉదయం విజయవాడకు వచ్చి తిరిగి సాయంత్రం హైదరాబాద్ వెళ్లిపోయారంటూ ఫ్లైట్ రాడార్ చిత్రాలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి.

# లేడీ డాన్ ఎక్కడా...

**లక్నో:**

శాయిస్తా పర్వీన్.. ఇప్పుడీ పేరు యూపీలో మారుమోగుతోంది. అయితే.. సడెన్‌గా తెరపైకి వచ్చిన ఈమె ఎవరో కాదు.. రెండు రోజులు క్రితం దారుణహత్యకు గురైన అతీఖ్ అహ్మద్ భార్యనే.. శాయిస్తా పర్వీన్. అతీఖ్, అష్రఫ్‌ల అంత్యక్రియలకు కూడా హాజరుకాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో గ్యాంగ్‌స్టర్ అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అష్రఫ్ అహ్మద్ హత్యలపై పోలీసుల దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. ఈ తరుణంలో పోలీసుల దృష్టి అతీఖ్ అహ్మద్ భార్య శాయిస్తా పర్వీన్‌పై పడింది. అంత్యక్రియలకు శాయిస్తా పర్వీన్ తప్పకుండా హాజరవుతారని ప్రచారం జరిగినా అలా హాజరుకాలేదు. కొన్నాళ్లుగా పరారీలో ఉన్న ఆమెపై 50 వేల రివార్డ్ కూడా ఉంది. భర్తను హత్య చేశారని తెలియగానే శాయిస్తా పర్వీన్ వెక్కివెక్కి ఏడ్చారని, కళ్లు తిరిగి పడిపోయారని తెలుస్తోంది. దాంతో.. పర్వీన్ లొంగిపోతారనే ప్రచారం జరిగింది. కానీ.. ఆ ప్రచారమంతా ఉత్తిదే అని పోలీసులు అనుమానిస్తున్నారు. అతీఖ్ అహ్మద్ నేర సామ్రాజ్యాన్ని నడపడంలో శాయిస్తా పర్వీన్‌ది కీలక పాత్రగా భావిస్తున్నారు. అతీఖ్ అహ్మద్ జైలులో ఉండగా మాఫియా సభ్యులతో అక్రమ వ్యవహారాలన్నీ ఆమెనే చక్కబెట్టారని పోలీసులు చెబుతున్నారు.ఇక.. అతీక్, అష్రాఫ్ హత్యలపై దర్యాప్తునకు యూపీ సీఎం యోగి ముగ్గురు సభ్యులతో జ్యుడీషియల్ కమిటీని, సిట్‌ను నియమించారు. డీజీపీ నుంచి ఆయన ఎప్పటికప్పుడు తాజా పరిస్థితులను తెలుసుకుంటున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా యూపీ అంతటా అలెర్ట్ ప్రకటించారు. యూపీలోని అన్ని జిల్లాల్లో ప్రస్తుతం 144 సెక్షన్ కొనసాగుతోంది. అటు.. అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్‌ను కాల్చి చంపిన లవ్లేశ్ తివారీ, సన్నీ సింగ్, అరుణ్ మౌర్యను భద్రతా కారణాల దృష్ట్యా ప్రయాగ్‌రాజ్ జైలు నుంచి ప్రతాప్‌గఢ్ జిల్లా జైలుకు తరలించారు. మొత్తంగా.. అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్ హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. అదే సమయంలో అతీక్ భార్య శాయిస్తా పర్వీన్ కోసం కొనసాగుతున్న పోలీసుల వేట ఎప్పుడు ముగుస్తుందో చూడాలి.

## గొర్రెల పెంపకం లాభదాయకంగా మారుస్తాం

**ఆలూరు**

ఆలూరు నియోజకవర్గం పల్లెదొడ్డి గ్రామంలో మహిళా రైతు నాగమ్మ నిర్వహిస్తున్న గొర్రెల ఫామ్ ని నారా లోకేష్ మంగళవారం పరిశీలించారు. రైతు నాగమ్మ, భర్త కృష్ణన్న గౌడ్ తో మాట్లాడి గొర్రెల పెంపకం లో వారు ఎదుర్కుం టున్న సమస్యలు అడిగి తెలుసు కున్నారు. రెండేళ్లుగా షెడ్ ఏర్పాటు చేసుకొని గొర్రెల ఫామ్ నిర్వహిస్తున్నాం. షెడ్ నిర్మాణానికి రెండున్నర లక్షల ఖర్చు అయ్యింది. మొదటి ఏడాది 50 గొర్రెల తో ఫామ్ ప్రారంభించాం. రెండేళ్ల లో రెండు లక్షల నష్టం రావడంతో ప్రస్తుతం 30 గొర్రెలు మాత్రమే పెంచుతున్నాం. ఏడాదికి మేత, దాణా, మందులు, ఇతర ఖర్చులు సుమారుగా రెండు లక్షలు అవుతుంది. ఇంత కష్టం చేస్తే రోజు కూలీ మాత్రమే మిగులుతుంది. ప్రభుత్వం నుండి షెడ్ నిర్మాణం, మేత, దాణా, మందులు కొనడానికి ఎటువంటి సహాయం, సబ్సిడీలు రావడం లేదు అంటూ మహిళా రైతు నాగమ్మ కన్నీరు పెట్టుకున్నారు. లోకేష్ మాట్లాడుతూ అధైర్య పడొద్దు అంటూ నాగమ్మ కు ధైర్యం చెప్పారు. అవగాహన లేని ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఎంత ప్రమాదమో కళ్లారా చూస్తున్నాను. గొర్రెల పెంపకం కోసం టిడిపి పాలనలో అనేక చర్యలు తీసుకున్నాం. గొర్రెలు కొనడానికి సబ్సిడీ రుణాలు అందించాం. మేత, దాణా, మందులు అన్ని సబ్సిడీ ధర కి అందించాం. ఇప్పుడు జగన్ ప్రభుత్వం గొర్రెల పెంపకానికి ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదు. టిడిపి హయాంలో షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రుణాలు అందించాం. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి మినీ గోకులంలు ఏర్పాటు చేశామని అన్నారు.కనీసం గొర్రెల పెంపకం కోసం తాగునీరు అందించలేని పరిస్థితి. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్సిడీ తో షెడ్లు నిర్మాణం కోసం రుణాలు అందించి గొర్రెల ఫామ్ నిర్వహణ కు సహకారం అందిస్తాం. మందులు, ఫీడ్ అన్ని తక్కువ ధరకు అందించి గొర్రెల పెంపకంలో రైతులకి లాభం వచ్చేలా చేస్తాం అంటూ దైర్యం చెప్పారు.

# దేశ చరిత్రలో మొట్ట మొదటిసారి

**ఒకేసారి చంద్రగిరి నియోజక వర్గంలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు**

**ఈ నెల 21న కలెక్టరేట్ లోని ఉద్యోగస్తులకు, తుడా సిబ్బందికి వైద్య పరీక్షలు- కలెక్టర్**

**తిరుపతి,**

ఆరోగ్యవంతమైన భవిత, ప్రజలు రాష్ట్రానికి, దేశానికి వెన్నెముక అని భావించిన రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ మరియు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ప్రభుత్వ లక్ష్యాన్ని వైద్య ఆరోగ్య శాఖ వారు అంది పుచ్చుకోవాలి అని, అదే దిశలో చంద్రగిరి నియోజకర్గంలో గౌ. శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి వారి ఆధ్వర్యంలో తుడా సహకారంతో పెద్ద ఎత్తున ప్రజలకు అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి రోగం తీవ్రం కాకుండానే ముందుగానే గుర్తించి చికిత్స అందించే దిశలో చర్యలు చేపట్టడం అభినందనీయం అని, ఇది దేశంలోనే మొట్టమొదటి సారిగా అమలు చేయబడుతోందని మిగిలిన రాష్ట్రాలకు ఇది దిక్సూచి అవుతుందని జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వైద్య అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో పేద ప్రజలకు అసంక్రమిత వ్యాధుల పరీక్షలు ఈ నెల 24 నుండి సచివాలయ పరిధిలో రోజుకు 4000 మందికి ఒక్కో సచివాలయం కు 2000 మంది చొప్పున రెండు రోజులు, రెండు ప్రదేశాల్లో వైద్య పరీక్షలు చేపట్టి 90 రోజుల్లో నియోజక వర్గంలోని ప్రజందరూ కవర్ అయ్యేలా ప్రణాలిక ఏర్పాటుతో, రోగ నిర్ధారణ అయిన తర్వాత చికిత్సకు ఆరోగ్యశ్రీ సంబంధిత ఆసుపత్రికి లేదా ప్రైవేట్ ఆస్పత్రి కి రెఫర్ చేయడం జరుగుతుందని అన్నారు. చికిత్స అనంతరం ఫాలోఅప్ మందులు గైడెన్స్ తరచూ గృహ సందర్శన ద్వారా చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీనివలన ముందుగానే రోగనిర్ధారణ జరిగి చికిత్స చేసి ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఉంటుందని, ఆరోగ్యశ్రీ పై ఒత్తిడి తగ్గుతుందని ఈ బృహత్తర కార్యక్రమానికి అందరూ సహకరించి సమన్వయంతో పేదల ఆరోగ్యం కొరకు చేపట్టిన యజ్ఞాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పరీక్షలు 106 సచివాలయాల పరిధిలో సుమారు 5 లక్షల మంది జనాభా కలిగిన చంద్రగిరి నియోజకవర్గంలో రోజువారిగా 104 వాహనాల ద్వారా పరీక్షలు జరిగే ప్రాంతాలు, వాటి తేదీలు, వాటికి కేటాయించబడిన వైద్యాధికారులు సిబ్బంది, వాటి వివరాలను మ్యాపింగ్ చేసి ముందుగానే ఆ గ్రామంలో దండోరా వేసి ప్రజలకు అవగాహన కల్పించి ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య ఆసుపత్రులు యాజమాన్యాలు ఇందులో భాగస్వాములై వారి సిబ్బంది ని వివరాలను మ్యాపింగ్ చేసి సహకరించాలని తెలిపారు. వైద్య పరీక్షల నిర్వహణకు బ్లడ్ శాంపిల్స్ కొరకు ఒక్కో చోట 30 కౌంటర్లు ఏర్పాటు చేసి వైద్య పరీక్షకు వచ్చే ప్రజలకు టైం స్లాట్ కేటాయించడం జరుగుతుందని సదరు మెడికల్ రిపోర్టులు యాప్ లో ఆన్లైన్లో అప్లోడ్ చేసి భవిష్యత్తు కొరకు అందుబాటులో ఉంచటం జరుగుతుందని తెలిపారు. ఈ విధమైన స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ఆయా సచివాలయ పరిధిలోని ప్రజలకు గల ఆరోగ్య సమస్యల రికార్డు ఏర్పాటుతో అవసరమైన మేరకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టే ఒక పక్కా డేటాబేస్ ఉంటుందని తెలిపారు. దీని ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగా గుర్తించే అవకాశం ఉంటుందని వారికి మంచి చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలోనే ఈ 104 వాహనాల ద్వారా 65 రకాల పరీక్షలు చేసి, 105 రకాల మందులు అందుబాటులో ఉంచి సేవలు అందిస్తున్నామని, ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఇఅఉ తదితర పరీక్షలు నిర్వహించేలా స్క్రీనింగ్ పరీక్షలు చంద్రగిరి నియోజక వర్గంలో చేపడుతున్నామని అన్నారు.ఇందులో భాగంగా ముందుగా ఈనెల 21న కలెక్టరేట్లో ఉద్యోగస్తులకు తుడా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వివరాలను సరిచూడడం జరుగుతుందని తెలిపారు

## పజాస్వామ్యాన్ని కలుషితం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు


**నిర్మల్**

బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయాల పేరుతో ప్రజలతో ఆటలాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని కలుషితం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓహోటల్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర కు వచ్చిన స్పందన చూసి ఓర్వలేకనే రాహుల్ గాంధీ రాజ్యసభ సభ్యత్వాన్ని బిజెపి రద్దు చేయించిం దన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్ద సంఖ్యలో నాయకులు ఉన్న పార్టీ అని, పార్టీ నుంచి ఎందరు వెళ్లిపోయిన పార్టీకి నష్టం జరగదని తెలిపారు. దేశంలో గాంధీ వారసత్వాన్ని చెరిపేసేందుకే బిజెపి కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ నియోజక వర్గంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి వెళ్లిపోవడంతో కిందిస్థాయి కార్యకర్తలు సంతోషంలో ఉన్నారని, రాబోయే వారం రోజుల్లో నియోజకవర్గంలో భారీగా చేరికలు ఉండబోతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఓటు విలువ 10 లక్షలు, 6వేలుగా మారిపోయిందన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## ఆపరేషన్ చేసారు..కడుపులో బట్టను వదిలేసారు

**జగిత్యాల**



జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. ఒక మహిళకు ఆపరేషన్ చేసిన వైద్యులు కడుపులో బట్టను వదిలేసిన ఘటన ఇది. పదహారు నెలల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో నవ్యశ్రీకి డెలివరీ అయింది. ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేసి లోపలే క్లాత్ మర్చిపోయారు. ఏడాది తర్వాత నవ్యశ్రీకి తీవ్ర కడుపు నొప్పి రావడంతో నవ్యశ్రీ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చెకప్ చేయించుకుంది. స్కానింగ్ లో లో కడుపులో బట్ట ఉన్నట్టు గుర్తించారు. వెంటనే ఆసుపత్రిలో సర్జరీ చేసి బట్టను తొలగించారు.

## దొంగను పట్టుకున్న స్థానికులు

**మెదక్**



మెదక్ జిల్లా నర్సాపూర్ లోని సునీతా లక్ష్మారెడ్డి కాలనీలో సోమవారం అర్ధరాత్రి దొంగ హల్చల్ చేసాడు. అర్ధరాత్రి కత్తితో ఒక ఇంట్లోకి దొంగ చొరబడ్డాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు అప్రమత్తమయి కేకలు వేయడంతో పారిపోయేందుకు ప్రయత్నించాడు. అలజడికి లేచిన స్థానికులు దొంగను పట్టుకుని స్తంబానికి కట్టేసి దేహశుద్ధి చేసారు. తరువాత పోలీసులకు సమాచారమందించారు.

## మునుకుళ్ల గ్రామంలో రేషన్ దందా

**విజయవాడ**

కృష్ణా జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ల వేదికగా రేషన్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. గ్రామంలో విజిలెన్స్ అధికారులు వారం రోజుల్లోనే రెండు రేషన్ లారీలను సీజ్ చేసారు. అధిక రేట్లతో పేదలకు ఇచ్చే బియ్యాన్ని కొనుక్కొని అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు.

వారం రోజుల క్రితం విజిలెన్స్ అధికారులు గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో సుమారు 190 క్వింటాలు (8 లక్షల విలువ చేసే రేషన్ బియ్యం) పట్టుకోగా సోమవారం రాత్రి అక్కపాలెంలో ఆ మాఫియా డాన్ కు చెందిన న 15 క్వింటాల లారీని (5,85,000 వేలు) విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు.

## గద్దేరాళ్ల గ్రామస్థులతో లోకేష్ భేటీ

**కర్నూలు**

ఆలూరునియోజకవర్గం, గద్దేరాళ్ల గ్రామస్తులు మంగళవారం నాడు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిసి వినతిపత్రం అందించారు. మా గ్రామంలో రైతులు కాలువలు, పిల్లకాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామం మీదుగా 8 గ్రామాల ప్రజలు తిరుగుతుంటారు. మా గ్రామంలో రోడ్డు సదుపాయం లేదు. కర్నూలు-బళ్లారి హైవే దగ్గర మా గ్రామంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలి. గద్దేరాళ్ల మారెమ్మ దేవస్థానం పునరుద్ధరణ చేయాలని కోరారు.

లోకేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో రైతులు తీవ్ర సంక్షోభంలో మునిగిపోయారు. రైతులకు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను నిలిపేశారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు లేవు. రోడ్లు నిర్మాణాలు లేవు. మేం అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా, పందికోన రిజర్వాయ్ నుండి రైతులకు సాగునీరు అందించే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో అవసరమైన రోడ్లు నిర్మిస్తాం. అవసరమైన ప్రదేశాల్లో బస్టాండ్ నిర్మిస్తాం. గద్దేరాళ్ల మారెమ్మ దేవాలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఉండవల్లి కొండ దగ్గరలో టీడీపీ అందోళన

**మంగళగిరి**

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం, ఉండవల్లి కొండ వద్ద టీడీపీ నాయకులు అందోళనకు దిగారు. అక్రమ తవ్వకాలను నిరసిస్తూ మండుటెండను సైతం లెక్క చేయకుండా ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి కొండ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులను పోలీసులు ను అరెస్ట్ చేసారు. తవ్వకాలకు సంబంధించిన పర్మిషన్లను చూపించమన్నందుకు అరెస్ట్ చేసారని అందోళనకారులు ఆరోపించారు. అరెస్ట్ చేసిన టీడీపీ నాయకులను రెండు వాహనాలలో స్టేషన్కు తరలించారు. మహిళలను సైతం బలవంతంగా వ్యాన్లోకి ఎక్కించారు. స్థానిక ఎమ్మెల్యేను వెంటనే అరెస్ట్ చేయాలంటూ టీడీపీ నాయకులు నినాదాలు చేసారు. ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యువకుడి అనుమానస్పద మృతి

**నెల్లూరు**

నెల్లూరు నగరం లోని నర్తకి సెంటర్ వద్ద యువకుడు అనుమానస్పద మృతి చెందాడు. మృతుడు బిట్రగుంట. బోగోలుకు చెందిన బాధనపురి వినయ్ కుమార్ గా గుర్తించారు. తలకి బలమైన గాయం తగిలి తీవ్ర రక్తస్రావం అయినందు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు యువకుడిని ఎవరో హత్య చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జి జి హెచ్ హాస్పిటల్ తరలించారు. ఆరో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# ఉదయగిరిపై మేకపాటి ఫ్యామిలీ గురి

**నెల్లూరు:**

ఏపీలో నలుగురు ఎమ్మెల్యేలను వైసీపీ సస్పెండ్ చేసింది. ఆ నాలుగు చోట్ల మూడింటిలో నియోజకవర్గ ఇన్ చార్జ్ లు ఉన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గానికి మాత్రం ఇన్ చార్జ్ ని ప్రకటించే విషయంలో ఎందుకో వైసీపీ అధిష్టానం వెనకాడుతోంది. ఉండవల్లి శ్రీదేవి విషయంలో చాన్నాళ్ల ముందే అక్కడ డొక్కా మాణిక్య వరప్రసాద్ ని ఇన్ చార్జ్ గా పెట్టారు. తర్వాత మరో ఇంచార్జ్ని కూడా నియమించారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే అక్కడ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నెల్లూరు రూరల్ లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి విమర్శలు చేసిన రెండోరోజే ఆదాల ప్రభాకర్ రెడ్డిని ఇన్ చార్జ్ గా పెట్టారు. మరి ఉదయగిరిలో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి విషయంలో జగన్ ఎందుకు ఆలోచిస్తున్నారు. చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి రోజులు గడస్తున్నా అక్కడ ఇన్ చార్జ్ ను ఇంకా నియమించలేదు. మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి సహా.. ఉదయగిరి నియోజకవర్గానికి ఇన్ చార్జ్ లు గా చాలామంది పేర్లు పరిశీలించింది వైసీపీ అధిష్టానం. వారిలో వంటేరు పేరు దాదాపుగా ఫైనల్ అయినట్టే అనుకున్నారు. రేపో మాపో ప్రకటన ఉంటుంది అనుకుంటున్న సమయంలో బ్రేక్ పడింది. అసలు ఉదయగిరి విషయంలో వైసీపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సైలెంట్ గా ఉంది. ఇప్పటికే చాలామంది ఆశావహులు తాడేపల్లి వెళ్లి తమ పేర్లు పరిశీలించాలని కోరుతున్నారు. చంద్రశేఖర్ రెడ్డిని ఢీకొంటామని, టీడీపీని చిత్తు చిత్తు చేస్తామని అంటున్నారు. కానీ కుదరడంలేదు, ఉదయగిరి ఇన్ చార్జ్ విషయంలో వైసీపీ వేచి చూసే ధోరణిలోనే ఉంది. ఇంచార్జ్ నియామకం అసలు కారణం మేకపాటి కుటుంబం. నెల్లూరు జిల్లాలో మేకపాటి కుటుంబానికి రెండు సీట్లు ఆనవాయితీగా వస్తున్నాయి. 2014లో మేకపాటి రాజమోహన్ రెడ్డి ఎంపీగా ఉండగా, ఆయన తనయుడు మేకపాటి గౌతమ్ రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. 2019లో మేకపాటి గౌతమ్ రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా తిరిగి గెలిచారు, ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి గెలిచారు. సో.. మళ్లీ ఆ కుటుంబానికి రెండు సీట్లు వచ్చాయి. గౌతమ్ రెడ్డి అకాల మరణం తర్వాత ఆయన సోదరుడు విక్రమ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో ఆ కుటుంబానికి రెండు సీట్లు కంటిన్యూ అయ్యాయి. ఇప్పుడు సడన్ గా ఉదయగిరి నుంచి చంద్రశేఖర్ రెడ్డిని బయటకు పంపిస్తే లెక్క తేడా వచ్చేసింది. ఉదయగిరి నియోజకవర్గాన్ని వేరెవరికి కేటాయించినా మేకపాటి హవా తగ్గిపోతుంది. అందుకే ఉదయగిరి సీటు కూడా ఆ కుటుంబానికే ఉండాలనే వ్యూహ రచన మొదలైంది. ఇటీవల మేకపాటి రాజమోహన్ రెడ్డి వ్యూహాత్మకంగా ప్రెస్ మీట్ పెట్టి చంద్రశేఖర్ రెడ్డిని చెడామడా తిట్టేశారు. అదే రోజు ఆయన చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె రచనా రెడ్డి పేరు తెరపైకి తెచ్చారు. రచనా రెడ్డి ఆదాల ఇంటి కోడలు కావడంతో జగన్ అంగీకరిస్తారని భావిస్తున్నారు. ఉదయగిరి సీటు రచనా రెడ్డికి ఇచ్చేలా, ఇన్ చార్జ్ గా ఆమెను ప్రకటించాలన్నారు రాజమోహన్ రెడ్డి. కుదరకపోతే, మరో సోదరుడు మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఇన్ చార్జ్ పదవి ఇవ్వాలని అంటున్నారు. ఇటీవల సీఎం జగన్ ని మేకపాటి కుటుంబం కలసి వచ్చింది. ఇదే విషయంలో వారు జగన్ కి తమ అభ్యర్థన తెలియజేశారని అంటున్నారు. ఉదయగిరిలో చంద్రశేఖర్ రెడ్డిని బయటకు పంపించినా.. టికెట్ మాత్రం తమ కుటుంబంలో మరొకరికి ఇవ్వాలని వారు జగన్ పై ఒత్తిడి తెస్తున్నారు. అందుకే ఆ నియోజకవర్గ ఇన్ చార్జ్ ప్రకటన అనూహ్యంగా వాయిదా పడుతోంది.

# టీఎస్ ఆర్టీసీ 550 ఏసీ బస్సులు...

**హైదరాబాద్:**

తెలంగాణ ఆర్టీసి త్వరలో ప్రయాణికులకు ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. వచ్చే నెలలో ఈ బస్సులను ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పర్యావరణ హితం, కాలుష్య నివారణతో పాటు ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు ఈ బస్సులను వాడకంలోకి తీసుకురాబోతున్నారు అధికారులు. హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో మొదటిసారి 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను అందుబాటులోకి రాబోతునట్లు తాజాగా యాఖీఅ ప్రకటించింది. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించేందుకు ఈ ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని, సౌకర్యాల విషయంలో రాజీ పడొద్దని ఒలెక్ట్రా గ్రీన్టెక్ లిమిటెడ్ ప్రతినిధులకు సూచించారు ఆర్టీసీ ఎండి సజ్జనార్. వచ్చే నెలలోనే కొన్ని బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 12 మీటర్ల పొడవు గల ఈ ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో 41 సీట్ల సామర్థ్యం ఉంటుంది. ఈ బస్సులకు ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 325 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. బస్సులో ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సౌకర్యంతో పాటు రీడింగ్ ల్యాంప్ లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా వెహికిల్ ట్రాకింగ్ సిస్టంతో పాటు ప్రతి సీటు వద్ద పానిక్ బటన్ సదుపాయం కల్పించారు. వీటిని టీఎస్ఆర్టీసీ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేస్తున్నారు. ప్రతి బస్సులోనూ మూడు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ బస్సులో సిసి కెమెరా బ్యాకప్ ఓ నెలరోజులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బస్సులోపల ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. బస్సు రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా ఉంటుంది. బస్సుకు ముందు వెనక ఎల్ఈడీ బోర్డులుంటాయి. అందులో గమ్యస్థానాల వివరాలు కనిపిస్తాయి. అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించేందుకు బస్సుల్లో ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం(ఎఫ్డీఎస్ఎస్)ను ఏర్పాటు చేశారు. బస్సులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగే అవకాశం ఉంటే వెంటనే గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేసేందుకు ఈ ఉపయోగపడుతుంది. బస్సు చేరుకునే స్టాఫ్ వివరాలను ప్రయాణికులకు సమాచారం చేరవేసేందుకు వీలుగా పబ్లిక్ అడ్రస్ సిస్టం ఈ ఎలక్ట్రికల్ ఏసి బస్సుల్లో ఏర్పాటు చేశారు. నిత్యం వాహనాల పొగతో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఒలెక్ట్రా గ్రీన్టెక్ లిమిటెడ్(ఓజీఎల్)కు 550 ఎలక్ట్రిక్ బస్సులను ఇప్పటికే ఆర్డర్ ఇచ్చింది. అందులో 500 బస్సులను హైదరాబాద్ సిటీలో, 50 బస్సులు విజయవాడ మార్గంలో తిప్పనున్నారు. ఇవి కాకుండా అశోక్ లేలాండ్, జీబీఎం సంస్థల నుంచి కూడా మరో 1000 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (ఉఅఅ) పద్ధతిలో విడతల వారీగా ఆయా సంస్థలు ఈ బస్సులను సాధ్యమైనంత వేగంగా తయారు చేసి టీఎస్ఆర్టీసీకి అందజేయనున్నాయి.

# పొంగులేటి అబద్ధాల కోరు

**ఖమ్మం**

జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తాతా మధు ప్రెస్ మీట్ నిర్వహించారు. దశాబ్దాలుగా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చి చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారు సీఎం కెసీఆర్. కేసీఆర్ ను చూసి రాజకీయ ప్రత్యర్థులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. దేశ వ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలు సీఎం కెసీఆర్ ను ఓడించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. సీఎం కెసిఆర్ ను రాజకీయంగా వ్యక్తిగతంగా దెబ్బ తీసేందుకు ఎంతోమంది ప్రయత్నం చేశారు. ఢిల్లీ నుండి కుట్రలు జరుగుతున్నాయి వారికి సహకరించేందుకు ఇక్కడ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారికి సహకరిస్తున్నాడు. బీఆర్ఎస్ పార్టీ ద్వారా లబ్ధి పొంది పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ఉన్మాదిలాగా ప్రవర్తిస్తున్నారు. నిన్న కొన్ని ఛానెల్ లలో స్థాయి మరిచి మాట్లాడావు . ప్రజలను గందరగోళం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కెసిఆర్ ను కొనాలని చాలా మంది చూశారు అది జరగలేదు. నీ గురువు రాజశేఖర్ రెడ్డి వల్లనే జరగలేదు నువ్వెంత, నీ స్థాయి ఎంత. పొంగులేటి నువ్వు ప్రజలను మోసం చేస్తున్నావ్. పొంగులేటి నువ్వు ఒక అబద్ధాల కోరు. పెళ్లికి కాదు ని కూతురు ఎంగేజ్మెంట్ కు కూడా సీఎం కెసీఆర్ వచ్చారు. నువ్వు చేస్తే రాజకీయంగా విమర్శించు తప్పు చేస్తే కానీ కూతురి పెళ్లిని, కొడుకు పెళ్లిని అడ్డుపెట్టుకుని విమర్శించి దిగజారకని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం కుటుంబాన్ని వాడుకునే వారిని మొదటగా నిన్నే చూడడమని అన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సుకేశ్ చంద్రశేఖర్ కు పెద్ద తేడా ఏమి లేదు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 9 నియోజకవర్గాల్లో ఓటమి పాలైంది, పొంగులేటికి ఇంఛార్జి ఇచ్చిన మధిర ఎలా ఓటమి పాలైంది నీకు దమ్ము లేదా అని ప్రశ్నించారు. మదన్ లాల్ ను ఓడించి రాములు నాయక్ ను పార్టీలోకి ఎందుకు తీసుకువచ్చావ్. నువ్వు ఏ పార్టీకి వెళ్ళినా అక్కడ ఆ పార్టీ నాయకులు ఉంటారు గుర్తు పెట్టుకో. కమ్యూనిస్ట్ ల కారణంగా నువ్వు గెలుపొందావు. కమ్యూనిస్ట్ ల గురించి మాట్లాడే హక్కు నీకు ఉందా వారి గురించి స్టేట్మెంట్ ఇచ్చే స్థాయికి నువ్వు ఎదగలేదని అన్నారు.

చీమలపాడు ఘటనలో 4 కార్యకర్తలను కోల్పోయాం. అందరికంటే ముందు స్పందించింది మేము క్షేత్ర స్థాయిలో పని చేసింది మేము. కేంద్ర హోంమంత్రి సభలో తొక్కిసలాటలో కొందరు మృతి చెందారు. ఆయనపై కూడా కేసులు పెట్టాలా అని నిలదీసారు.

ఖమ్మం నుండి హైదరాబాద్ వరకు నువ్వు చేసిన ఆర్థిక నేరాలు, భూదందాలను బయట పెడతాం. డీసీసీబీ బ్యాంక్ లో ఆర్థిక నేరం చేసిన వారిని ని పక్కన పెట్టుకున్నావు. సీఎం కెసిఆర్, కేటీఆర్ లపై అవాక్కులు, చేవాక్కులు పేలితే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు. నారాయణపురం కాంట్రాక్టర్ గా అవతారం ఎత్తిన నాటి నుండి నేటి వరకు నువ్వు చేసిన ఆర్థిక దందాలపై సీబీ సీఐడీకి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

## యాదాద్రిలో మంచు లక్ష్మి, మనోజ్ పూజలు

**యాదాద్రి**

సినీ నటులు మంచి లక్ష్మి, మనోజ్ కుమార్ మంగళవారం నాడు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో మంచు లక్ష్మి రెండు పర్యాయాలు సమావేశమయ్యారు. ఇందులో భాగంగానే సదరు స్కూల్స్ కు సంబంధించి ఓ ఏజెన్సీ తో సర్వే చేయించి, కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసం మరోసారి విద్యాశాఖ అధికారులతో సమావేశం అయ్యారు. అనంతరం మంచు లక్ష్మి మంచు మనోజ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలు మధ్య స్వామి వారి వివిధ ప్రసాదాల అందించారు.

## ఆర్ఆర్ఆర్ నిర్వాసితుల అందోళన

**భువనగిరి**

యాదాద్రి-భువనగిరి జిల్లా పరిధిలో రీజనల్ రింగ్ రోడ్ నిర్వాసితులు మంగళవారం ఉదయం వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బీజేపీ సీనియర్ నాయకులు గూడూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గతంలోనే కాలువ నిర్మాణం, ఇన్నర్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోయామని అన్నారు. మరొసారి ఉన్న కొద్దిపాటి భూములను సైతం రైతులు నష్టపోయే విధంగా రీజనల్ రింగ్ రోడ్డు ఉందని, వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. దీంతో.. జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ జరిగింది. పోలీసులు బిజెపి నేతలతో సహ రైతులను అరెస్టు చేసి.. పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**తుంగతుర్తి**

హైదరాబాద్ కుషాయిగూడ లోని అగ్ని ప్రమాద ఘటనలో మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నరేశ్(35), సుమ(28), జోషిత్(5) ఒకే కుటుంబంలోని ముగ్గురు అగ్నికీలలకు బలైపోయారు. స్థానిక ఎమ్మెల్యే గాధరి కిషోర్ కుమార్ మంగళవారం మృతుల నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి.. తక్షణ సాయంగా యాభై వేల రూపాయలు అందజేశారు. భవిష్యత్తులోనూ బాధిత కుటుంబానికి నావంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## యువకుడు ఆత్మహత్య

**నిర్మల్**

నిర్మల్ రూరల్ మండలం ఎల్లపల్లి గ్రామంలో అల్లకుంట నవీన్ (19) అనే యువకుడు ఉరివేసుకొని అనుమానాస్పద మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో కొద్ది రోజులుగా నవీన్ ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఇటీవల ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. యజమాని నవీన్ ను గ్రామ శివారులోకి తీసుకెళ్ళి కొట్టి ఉరి వేసి చంపాడని బంధువులు ఆరోపించారు. యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని ఆందోళన చేస్తున్న గ్రామస్తులకు సర్ది చెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సాఫ్ట్ వేర్ కంపేనీ మూసివేత

**హైదరాబాద్**

గచ్చిబౌలి లో ఒక సాఫ్ట్ వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఉద్యోగాలనుంచి తీసివేస్తున్నట్లు ఉద్యోగులకు మెయిల్ పంపించడందో ఉద్యోగులు గచ్చిబౌలిలోని ఇన్ఫోఫీ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. ఇన్ఫోసి కంపెనీలో మొత్తం 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 650 మంది పేరుతో రూ. 4 లక్షల రూపాయలు, 50 మంది పేరుతో 10 లక్షల చొప్పున ఇన్ఫోఫీ కంపెనీ లోన్ తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు ఏడాదిన్నరగా జీతాలు చెల్లించలేదని ఉద్యోగులు ఆరోపించారు.

## కుత్బుల్లాపూర్ లో అగ్నిమాపక దినోత్సవాలు

**రంగారెడ్డి**

1944 ఏప్రిల్ 14న ముంబయి విక్టోరియా డాక్ యార్డ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో విధి నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బంది స్మారకార్ధం ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా వారిని స్మరించుకుంటూ, అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలు జరుపుతుంటారు. ఈ సందర్భంగా జీడిమెట్ల అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్. జిల్లా అగ్ని మాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి బిఆర్ఎస్ పార్టీలో ముసలం

**భూపాలపల్లి**

భూపాలపల్లి బిఆర్ఎస్ పార్టీలో ముసలం చెలరేగింది. భూపాలపల్లి మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన 20 మంది కౌన్సిలర్లు చైర్మన్ వెంకట్ రాణి సిద్ధూ, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించారు. ఈ మేరకు, జిల్లా లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ దివాకర్ కు అవిశ్వాస తీర్మానం అందజేసారు.

# మునుగోడు హామీలను నెరవేస్తున్నాం

**హైదరాబాద్**

మునుగోడు ఉప.ఎన్నికల్లో ప్రజలకు ఇచిన హామీ ప్రకారం, సీఎం కేసీఆర్ సూచనలకు మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నామని మంత్రి హరీష్ రావు అన్నారు. చౌటుప్పల్ 36 కోట్ల రూపాయల నిధులతో 100 పడకల ఆసుపత్రిని శంకుస్థాపన, మర్రిగుడ లో 30 పడకల ఆసుపత్రిని మంజూరు, నల్లగొండ, సూర్యాపేట లలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఎర్పాటు చేసాం. కేంద్ర ప్రభుత్వం ఏయిమ్స్ బ ప్రారంభించినా అక్కడ వసతులు లేవు. కేవలం ఓపి సేవలే వునాయి. ఐపి సేవలు లేవు. కేంద్ర ప్రభుత్వం. రాష్ట్ర అభివృధిపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. వైద్య రంగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1300 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యాన్ని కెసిఆర్ ప్రభుత్వం నివారిస్తుంది. రాష్ట్రం రాక ముందు మూడు డయాలసిస్ సెంటర్లు వుంటే.. ఇప్పుడు 100 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశాం. డయాలసిస్ సేవలతోపాటు.. ఉచిత బస్ పాస్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చాం. -తంగేడిపల్లి పీహెచ్సి కి 90 లక్షలు మంజూరు చేశాము. కాంగ్రెస్, బిజెపి హయాంలో 20 ఏళ్లలో ఒక మెడికల్ కాలేజ్ వస్తె.. ఇప్పుడు ఒక యేడాదిలో ఎనిమిది మెడికల్ కాలేజ్ లకు పెంచుకున్నమని అన్నారు. నిరుపేదలకు వైద్యం వారి వద్దకే వెళ్ళాలని నినాదంతో.. పల్లె దవాఖానలు ఏర్పాటు చేసాం. కేసిఆర్ కిట్ ద్వారా.. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాలు 30 శాతం నుంచి 68 శాతంకి పెరిగాయి. కెసిఆర్ కిట్ తోపాటు.. కెసిఆర్ న్యూట్రిషన్ పథకం కూడా అందించాలని నిర్ణయినీచుకున్నరు. గతంలో ఎంబీబీఎస్ చదవా లంటే ఉక్రెయిన్, ఫిలిఫెన్స్ వెళ్ళేవారు. ఇప్పుడు 35మెడికల్ కళాశాలలు అందు బాటులోకి వచ్చాయి. విద్యార్ధులు బయటికి వెళ్లకుండా స్వరాష్ట్రంలో ఎంబీబీఎస్ చేస్తున్నారు. చౌటుప్పల్ హైవేపై.. 100 పడకల ఆసుపత్రి తోపాటు క్రిటికల్ సేవలు అందుబాటులో తెస్తామని అన్నారు.

# కులగణనకు 16 పార్టీలు మద్దతు శుభ పరిణామం

**ఇది జాతీయ బిసి సంక్షేమ సంఘం పోరాట ఫలితం- జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య**

**హైదరాబాద్ :**



కులాల వారి లెక్కలు తీయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మరియు రాహుల్ గాంధీ గారు ప్రధానమంత్రిని కోరుతూ లేఖలు రాయడం శుభ పరిణామమని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎం.పి ఆర్. కృష్ణయ్య అన్నారు. మంగళవారం బిసి భవన్ లో పలు బిసి సంఘాల నేతలతో కలిసి మీడియా సమావేశం లో మాట్లాడారు. ఇటీవల డిల్లీలో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సీతారాం ఏచూరి, అఖిలేశ్ యధవ్, తేజస్వి యధవ్ తో సహ 16 పార్టీల నాయకులను కలిసి చర్చలు జరిపిన తరువాత అన్నీ పార్టీలు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవడం జాతీయ బిసి సంక్షేమ సంఘం పోరాట పలితమన్నారు.ఇంతకు పూర్వం బీహార్, ఒరిస్సా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు కూడా కులాల వారీగా లెక్కలు తీయాలని ప్రభుత్వం పరంగా నిర్ణయం తీసుకుంది. కులలవారి లెక్కలు తీయడానికి కేంద్ర ప్రభుత్వానికి అన్నీ పార్టీలు ముఖ్యంగా 16 పార్టీలు పార్లమెంటులో లోపల - బయట పూర్తిగా మద్దతు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయకుండా బీసీ వ్యతిరేక వైఖరి అవలంబించడం మనుకోవాలని కోరారు. కుల గణన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం కల్పించిన సదుపాయాల కోసం అవసరం. కుల గణనతో ఒక్కొక్క కులం జనాభాతో పాటు సాంఘీక, ఆర్థిక, రాజకీయ వివరాలు సేకరించి వారి కులాలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు లభిస్తాయి. జనాభా ప్రకారం కులాల కార్పొరేషన్లకు, పెడరేషన్లకు బడ్జెట్ కేటాయించి వారి ఆర్థికాభివృద్ధి కి చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది, బి.సి కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి గ్రూపులుగా వర్గీకరించడానికి కులాల వారి జనాభా లెక్కలు ఉపయోజపడుతుంది.

కేంద్ర ప్రభుత్వం జన గణనలో కులగణన చేపట్టడానికి అంగీకరించకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుంది. బిజెపి పార్టీలో ఉన్న బీసీ నాయకులంధరూ కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని కోరారు. జనగణన పట్టికలో 34 కాలమ్స్ పెట్టడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకించడం దుర్మార్గం. ఒక్క రూపాయి అదనపు ఖర్చు లేకుండా దేశంలోని కులాల వివరాలన్నీ వస్తాయి. ఎందుకు ఃఏఖ ప్రభుత్వం అంగీకరించడం లేదు. దేశంలోని 75 కోట్ల మంది బి.సి లకు అభివృద్ధి చేయకుండా భారతదేశం అగ్రదేశంగా తయారవుతుందా? ఎందుకింత బి.సి ల పట్ల కక్షా! వివక్షా ! బి.సి ల పట్ల కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మండల్ కమిషన్ 40 సిఫార్సులు చేస్తే కేవలం రెండు సిఫార్సులు మాత్రమే అమలుచేశారు. మిగతా 38 సిఫార్సులు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. రాజ్యాంగబద్ధమైన కమిషన్ సిఫార్సులకు విలువలేదా? అమలు చేయరా? ఈ పేదకులాలు అభివృద్ధి చెందకూడదా? బి.సి. కులాలను కులకోణంలో చూసి ఈర్ష్య, ద్వేషాలతో అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

# చిన్నారిని వెంటాడిన మృత్యువు

**వానరాల వీరంగంతో బండ మీద పడి**

**బాలుడి మృతి**

**సిద్ధిపేట**



విషాదమంటే ఇదే. ప్రాణానికి ప్రాణంగా పెంచుకుంటున్న బిడ్డకు ప్రమాదవశాత్తు గాయం కాగా నాలుగు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చికిత్స చేయించారా తల్లిదండ్రులు. డబ్బులు పోయిన బిడ్డ దక్కాడన్న సంతోషం వారికి ఎన్నో రోజులు నిలువలేదు. కోతుల రూపంలో మృత్యువు ఆ బాబును కబాలించింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూరులో సోమవారం జరిగింది. సర్పంచ్ జిల్లెల అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కట్కూర్ కు చెందిన దేవునూరి శ్రీకాంత్, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు. వారికి స్లాబు గదులతో పాటు రేకులతో కూడిన వంటశాల ఉంది. రెండింటికి మధ్య గాలి వెలుతురు కోసం ఖాళీ ఉన్న ప్రదేశంపై తడక పెట్టి గాలికి ఎగిరిపోకుండా దానిపై ఓ బండ ఉంచారు. సోమవారం కోతులు ఖాళీ ప్రదేశం నుండి ఇంటి లోపలికి ప్రవేశించాయి. రజిత గమనించి కోతులను బయటకు వెళ్లగొట్టేందుకు వంటింట్లోకి వెళ్లారు. ఆమె వెంట రెండున్నర ఏళ్ల చిన్న కుమారుడు అభినవ్ ఉన్నాడు. వచ్చిన మార్గం నుంచే వెళ్లడానికి వానరలు ఎగిరి తడక పైకి దూకాయి. అక్కడ ఉన్న బండ కదిలి కింద ఉన్న బాలుడి తలపై పడింది. దాంతో తల పగిలి బాలుడు అక్కడికక్కడే దుర్మారణం చెందాడు. నెల రోజుల క్రితం అభినవ్ ఇంట్లో గడప దాటుతున్న సమయంలో కాలు జారిపడ్డాడు. అక్కడే ఉన్న కత్తి తగిలి గొంతు కొంత మేర దిగింది. నాలుగు లక్షలకు పైగా ఖర్చు చేసి ఆసుపత్రిలో చికిత్స చేయించి తల్లిదండ్రులు బాలుడిని దక్కించుకున్నారు. కానీ కోతుల ఆగడాల కారణంగా వారికి గుండె కోత మిగిలింది.

# ఔరంగాబాద్ లో ముచ్చటగా 3వ సభ

**ముంబై :**

మహారాష్ట్రపై కేసీఆర్ ప్రత్యేక ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. ఆ రాష్ట్రంలో బహిరంగ సభల ఏర్పాటును ముమ్మరం చేస్తున్నారు. నాయకుల చేరిక కూడా అదే స్పీడ్‌తో సాగుతోంది. వచ్చే ఎన్నికల నాటికి మహారాష్ట్రలో ప్రత్యమ్నాయ శక్తిగా బీఆర్ఎస్‌ను చూపాలన్నదే కేసీఆర్ ఆలోచనగా కనిపిస్తోంది. మహారాష్ట్రలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టిన కేసీఆర్... చేరికలను ప్రోత్సహిస్తూనే.. బీఆర్ఎస్ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఓ ప్రాంతంలో భారీ బహిరంగ సభ పెట్టడం ఆ తర్వాత ఆ ఏరియాలో కీలకమైన యాక్టివ్‌గా ఉన్న నేతలను పార్టీలో చేర్పించుకుంటున్నారు. రెండు వ్యూహాలతో ప్రజల్లోకి వెళ్లడంతోపాటు పార్టీ కూడా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని ఆయన భావిస్తున్నారు. నాందేడ్, కందార్-లోహాలో సభల విజయంతో జోష్ మిాద ఉన్న కేసీఆర్ ఇప్పుడు మూడో సభకు ప్లాన్ చేశారు. రెండు సభలతో మరాఠ్వాడా ప్రాంత ప్రజల అభిమానం చూరగొన్న బీఆర్ఎస్ ఇప్పుడు మధ్య మహారాష్ట్రపై దృష్టి పెట్టింది. ఈ నెల 24న ఔరంగాబాద్‌లో నిర్వహించనున్న సభకు బీఆర్ఎస్ శ్రేణు లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.కంధార్-లోహా సభ అనంతరం ఔరంగాబాద్‌లో సభ నిర్వహించాలని స్థానిక నాయకులు, ప్రజల నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. దీంతో ఔరంగాబాద్‌లో మూడో సభ నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఔరంగాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని, మహారాష్ట్ర ప్రజలకు తెలంగాణ మోడల్‌పై అవగాహన కల్పించాలని డిసైడ్ అయింది పార్టీ. అందులో భాగంగా తెలంగాణలో అమలు అవుతున్న పథకాలపై వీడియో స్క్రీన్స్‌పై ప్రదర్శిస్తున్నారు. వీటిని ఊరూరా తిప్పి ప్రజల దృష్టిని ఆకట్టుకోనున్నారు. ఇదే వ్యూహాన్ని కంధార్-లోహా బహిరంగ సభకు ముందు అనుసరించారు. ఇప్పుడు ఔరంగాబాద్ సభకు ముందు కూడా ఇలాంటి ప్రచారాన్నే నమ్ముకుంది బీఆర్ఎస్. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు విస్తృత ఆదరణ లభిస్తున్నదని పార్టీ నేతలు చెబుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ సీట్ల రాజకీయాలతో మహారాష్ట్ర ప్రజలు విసుగుచెందారని అందుకే కేసీఆర్‌కు మంచి ఫాలోయింగ్ ఉందని అంచనా వేస్తున్నారు. కేసీఆర్ విజన్‌తోపాటు బీఆర్ఎస్ విధానాలకు కూడా అక్కడ యువత ఆకర్షితులవుతున్నారని అంటున్నారు. అలాంటి చాలా మంది నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వివరిస్తున్నారు. సోమవారం శివసేన సీనియర్ నేత, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అన్నా సాహెబ్ మానె బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు సీఎం కేసీఆర్ స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు గంగాపూర్‌కు చెందిన సంతోష్‌కుమార్, ఔరంగాబాద్ ఎన్సీపీ యూత్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పాటిల్ కూడా గులాబీ కండువా కప్పుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ లక్ష్యంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా బీఆర్ఎస్ ప్రణాళికలు వేస్తోంది. ఔరంగాబాద్ లో నిర్వహించతలపెట్టిన మూడో బహిరంగ సభలో వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్ఎస్ లో చేరనున్నారు. బీజేపీ, శివసేనతో పాటు ఎన్సీపీ, శివ సంగ్రామ్ పార్టీ, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ జాబితాలో ఉన్నారు. షెట్కారీ సంఘటన్ నేత శరద్ ప్రవీణ్ జోషి, మాజీ ఎమ్మెల్యేలు శంకరన్న డోంగె, సంగీత థోంబర్ తో పాటు వివిధ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాయకులు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీలో చేరారు

# డిసెంబరు నెలాఖరుకు లంబసింగి గిరిజన ఫ్రీడం ఫైటర్స్ మ్యూజియం పూర్తికి చర్యలు


**అమరావతి:**

రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో సుమారు రూ 35 కోట్ల అంచనాతో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాన్ని డిశంబరు నెలాఖరు లోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి ప్రధానమంత్రి సలహాదారు అమిత్ ఖేర్ కు వివరించారు.దేశవ్యాప్తంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంల నిర్మాణాల ప్రగతిపై మంగళవారం ఢిల్లీ నుండి ప్రధానమంత్రి సలహాదారు అమిత్ ఖేర్ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న సిఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మాచింగ్ గ్రాంటు 15 కోట్ల రూ.లు సిఎస్ఎస్ స్కీమ్ "సపోర్టు టూ ట్రై"గ్రాంటుతో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ బిల్డింగ్ నిధుల కలిపి సుమారు 35 కోట్ల రూ.ల అంచనాతో లంబసింగిలో చేపట్టిన ట్రైబల్ ఫ్రీడం ఫైటర్ మ్యూజియం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. డిశంబరు నెలాఖరు నాటికి పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.ఇప్పటికే ఇంటర్నల్ రోడ్లు,నీటిసరఫరా పనులు ప్రగతిలో ఉన్నాయని సిఎస్.డా.జవహర్ రెడ్డి వివరించారు.ఈట్రైబల్ ఫ్రీడం ఫైటర్ మ్యూజయం ఏర్పాటు పనులు 4 కాంపొనెంట్లలో జరుగుతున్నాయని చెప్పారు.ట్రైబల్ హట్ తో కూడిన రెస్టారెంట్,ఎంట్రెన్స్ ప్లాజా,యాంపీ థియేటర్,మ్యూజియం,హార్డ్ స్కేపింగ్,ల్యాండ్ స్కేపింగ్,కాంపౌండ్ గోడ వంటి పనులు వేగవంతంగా జరుగుతున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి ప్రధానమంత్రి సలహాదారు అమిత్ ఖేర్ కు వివరించారు.

ఈవీడియో సమావేశంలో ప్రధానమంత్రి వర్యుల సలహాదారు అమిత్ ఖేర్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో మంజూరైన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కోరారు. ఈవీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ,గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే,గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు జె.వెంకట మురళి,అదనపు సంచాలకులు ఇ.రాంబాబు,ఇఎన్సి ఎస్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడికి పరామర్శ

**జగిత్యాల,**



జగిత్యాల పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్ తల్లి గట్టు ప్రమీల ఇటీవల అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబ సభ్యులను హన్మకొండ లో వారి స్వగృహంజిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు దుమాల రాజ్ కుమార్ పరామర్శించారు.ఆయన వెంట బిరుదుల లక్ష్మణ్ న్యాయవాది,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిత్తరి ప్రభాకర్, గిద్దె శంకరయ్య ఎంపీటీసీ, సంపత్,తదితరులు ఉన్నారు.

# 30 నుంచి కొత్త సెక్రటేరియెట్

**ఫస్ట్ జీఏడీ, సెకండ్ ఫైనాన్స్, థర్డ్ రెవెన్యూ!**

**హైదరాబాద్ :**

వచ్చేవారం నుంచి కొత్త సెక్రటేరియట్‌లోకి డిపార్ట్‌మెంట్స్ షిఫ్టింగ్ పనులు షురూ కానున్నాయి. ఈ మేరకు రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేయనున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఏ ఫ్లోర్ లో, ఏ డిపార్ట్‌మెంట్ ఉండాలో కసరత్తు జరుగుతున్నది. నాలుగైదు రోజుల్లో షిఫ్టింగ్ పనులు పూర్తి కావాలని టార్గెట్ పెట్టుకున్నట్టు తెలిసింది. ఈనెల 30న కొత్త సెక్రటేరియట్‌ను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైన విషయం తెలిసిందే. ఈ లోపు ప్రస్తుతం బీఆర్కే బిల్డింగ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న డిపార్ట్ మెంట్లను కొత్త సెక్రటేరియట్ లోకి షిఫ్టింగ్ చేయాలని సీఎం భావిస్తున్నారు.కొత్త సెక్రటేరియట్‌లో ఏశాఖ ఏ ఫ్లోర్‌లో ఉండాలి? ఏ మంత్రి ఏ చాంబర్‌లో కూర్చోవాలి? ఏ అధికారికి ఎంత మేరకు స్పేస్ ఉన్న చాంబర్ ఇవ్వాలి? అనే అంశాలను నేరుగా సీఎం కేసీఆర్ పర్యవేక్షిస్తున్నట్టు తెలిసింది. రెండు రోజులుగా ఇదే పనిలో ఆయన నిమగ్నమయ్యారని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఈ నెల 24 నుంచి శాఖల తరలింపు ఉంటుందని సమాచారం. ఈ మేరకు రెండు, మూడు రోజల్లో ఆర్డర్స్‌ను వెలువడనున్నట్టు టాక్. ఇష్టానుసారంగా శాఖల కేటాయింపు ఉండకుండా అంతా సీఎం కేసీఆర్ కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు సమాచారం. అయితే డిపార్ట్‌మెంట్ ఉండే ఫ్లోర్ లోనే ఆ శాఖకు చెందిన మంత్రి చాంబర్, ఆయన పేషీను ఏర్పాటు చేస్తున్నారు.డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే సిబ్బంది, ఆ శాఖలో ఉండే సెక్షన్ల సంఖ్య మేరకు కొత్త సెక్రటేరియట్‌లో స్పేస్‌ను కేటాయిస్తున్నారు.



సెక్రటేరియట్ ఎంప్లాయీస్ వ్యవహారాలు, ప్రభుత్వ ప్రొటోకాల్ అంశాలను జీఏడీ పర్యవేక్షిస్తున్నది. దీంతో ఆశాఖను ఫస్ట్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. ఎక్కువ సెక్షన్లు ఉన్న ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌ను సెకండ్ ఫ్లోర్‌లో, రెవెన్యూ శాఖను థర్డ్ ఫ్లోర్‌లో, పంచాయతీ రాజ్‌కు 4వ అంతస్తు, ఇరిగేషన్‌కు 5వ అంతస్తు కేటాయించినట్టు టాక్. మిగతా శాఖలకు బిల్డింగ్‌లోని ప్రతి ఫ్లోర్ లో ఉండే రైట్ లేదా లెఫ్ట్ స్పేస్‌లో అలాట్మెంట్ చేస్తున్నట్టు తెలిసింది.కొత్త సెక్రటేరియట్‌లో ఒకే తీరుగా ఫర్నీచర్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో ప్రస్తుతం బీఆర్కే బిల్డింగ్‌లో ఉన్న ఫర్నీచర్‌ను అక్కడే వదిలేయాలని సూచించినట్టు సమాచారం. ప్రస్తుతం వాడుతున్న కంపూటర్లను కూడా అక్కడే వదిలేసి, పెన్ డ్రైవ్ లో డేటా, ఫిజికల్ ఫైల్స్‌ను మాత్రమే వెంట తెచ్చుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. వచ్చేవారం షిఫ్టింగ్ పనులు షురూ కానున్న నేపథ్యంలో సెక్రటేరియట్ స్టాఫ్ తమ శాఖల ఫైల్స్‌ను సర్దుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## కంట తడిపెట్టిన ఎమ్మెల్యే కూసుగుంట్ల

**భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మునుగోడు ఎమ్మెల్యే కూసుగుంట్ల ప్రభాకర్ రెడ్డి కంట తడిపెట్టుకున్నారు. అనుకోకుండా వచ్చిన ఉప ఎన్నికల్లో తనకు టికెట్ ఇప్పించి గెలిపించడంలో మంత్రులు హరీష్ రావు జగదీష్ రెడ్డి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు అందించిన తోడ్పాటును గుర్తుచేసుకొని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి భావాద్వేగానికి గురైయారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి కెసిఆర్, కేటీఆర్ ,హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డిల పుణ్యమేనని అన్నారు. తన నియోజకవర్గానికి అభివృద్ధి కి సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ స్టేజి పైనే ఆనందంలో కంట తడిపెట్టుకున్నారు.

## బంజారాహిల్స్ డిఏవి పాఠశాల ఘటనలో నిందితుడికి జైలు శిక్ష

**హైదరాబాద్**

బంజారా హిల్స్ డియేవి స్కూల్లో జరిగిన అకృత్యాలపై తీర్పు మంగళవారం నాడు వెలువడింది. స్కూలు డ్రైవర్ రజనీకుమార్ స్కూల్ పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడ్డ విషయం తెలిసిందే. నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో దోషిగా నాంపల్లి ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ తేల్చింది. నిందితుడు రజినీ కుమార్ కు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. రెండవ ముద్దాయిగా వున్న ప్రిన్సిపల్ మాధవీ రెడ్డిని నిర్దోషిగా తేల్చింది. గతేడాది అక్టోబర్ 17న బంజారాహిల్స్ డిఏవి స్కూల్ ప్రిన్సిపల్, కారు డ్రైవర్ రజిని కుమార్ పై లో కేసు నమోదు అయింది. పాఠశాలలో చదువుతున్న నాలుగేళ్ల బాలికపై పలుసార్లు లైంగిక దాడికి రజనీకుమార్ పాల్పడినట్లు నిర్ధారణ అయింది. బంజారాహిల్స్ పోలీసులు ఈ కేసుకు సంబంధించి సాక్షాధారాలు సమర్పించారు. రజనీ కుమార్ ను గతేడాది అక్టోబర్ 19న రజనీర్ కుమార్ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## అగ్ని ప్రమాదాల పై అవగాహన



**బద్వేలు**

అగ్నిమాపక వారోత్సవాల సందర్భముగా ఐదవ రోజు బుధవారం పోరుమామిళ్ళ కేంద్రాధికారి శ్రీ యల్ వసంత నాయక్ వారి అద్వర్యం లో సిబ్బంది మరియు వాహనంతో బయలుదేరి పోరుమామిల్ల పట్టణం లోని బాష ఇండియన్ గ్యాస్ గోడన్ నందు పనిచేస్తున సిబ్బందికి మరియు బాలాజీ హెచ్.పి. పెట్రోల్ బంక్ నందు సిబ్బందికి చుట్టు పక్కల ప్రజలకు అగ్నిప్రమాధాలు గ్యాస్ ఆయిల్ అగ్నిప్రమాదాలు ఎలా జరుగుతాయి, నియంత్రణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే వాటి గురించి వివరంగా తెలియపరిచి డెమో ద్వారా గ్యాస్ సిబ్బందికి, పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పించి, కరపత్రాలను పంచడమైనధి . కార్యక్రమములో హెచ్.పి. పెట్రోల్ బంక్ డీలర్ వై. నాగ రాజు, బాష ఇండియన్ గ్యాస్ ప్రోప్రిటర్ సయద్ బి బాష అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. అగ్ని ప్రమాదము జరిగిన వెంటనే 101 కి సమాచారం తెలియజేయండి

## ఆర్టీసీ బస్సు బోల్తా -పదిమందికి గాయాలు

**చంద్రగిరి**



ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మణి తో పాటు పదిమంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. నాయుడుపేట -పూతలపట్టు ప్రధాన రహదారిలోని చంద్రగిరి మండలం ,కొంగర వారి పల్లి సమీపంలో ఘటన చోటుచేసుకుంది. చిత్తూరు ఒకటవ డిపో చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుండి 35 మంది ప్రయాణికులతో చిత్తూరుకు వెళుతుండగా ప్రమాదానికి గురయింది. అతివేగంతో వెళుతున్న బస్సు అదుపుతప్పి సర్వీస్ రోడ్డు దాటి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మామిడి తోటలోకి దూసుకు వెళ్లి బోల్తా పడింది. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై చంద్రగిరి పోలీసులు విచారిస్తున్నారు.

## విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

**కాకినాడ**

విభిన్న ప్రతిభావంతుల హక్కుల కోసం టిడిపి అండగా ఉంటుందని కాకినాడ సిటి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హామీ ఇచ్చారు. జగన్మోహన రెడ్డి అన్ని వర్గాల ప్రజలతో పాటు వికలాంగులను కూడా మోసపూరిత వాగ్దానాలతో, మాయ మాటలతో నమ్మించి మోసం చేసాడని కొండబాబు విమర్శించారు.వైకాపా ప్రభుత్వంలో వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై జిల్లా విభిన్న ప్రతిభావంతుల హక్కుల పోరాట సభ్యులతో కలిసి టిడిపి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జిల్లా కలెక్టర్ను కలిసి వినతి పత్రం అందజేసారు.

# మే 10న ఇంటర్ రిజల్ట్స్, 15న టెన్త్ ఫలితాలు

**హైదరాబాద్ :**

తెలంగాణలోపదోతరగతి, ఇంటర్ పరీక్షలు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు ఇక ఫలితాలపై దృష్టి సారించారు. ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమైంది. దీంతో ఇక ఫలితాల విడుదలపై అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఎంసెట్, నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలు ఉన్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఇంటర్ వాల్యుయేషన్ ప్రక్రియను పూర్తిచేసి మే 10న ఇంటర్ ఫలితాలను విడుదల చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 9 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. షెడ్యూలు ప్రకారం మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత రాష్ట్రంలో ఏప్రిల్ 3న పదోతరగతి పరీక్షలు ప్రారంభించారు. ఏప్రిల్ 11తో ప్రధాన పరీక్షలు ముగియగా. ఇక ఏప్రిల్ 11తో ఒకేషనల్ పరీక్షలు, ఏప్రిల్ 13తో ఓరియంటెల్ పరీక్షలు ముగిశాయి. మూల్యాంకన ప్రక్రియ కూడా ఇప్పటికే ప్రారంభమైంది. ఈనేపథ్యంలో వీలైనంత త్వరగా ఫలితాలను విడుదల చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 21 వరకు మూల్యాంకనం చేపట్టి, ఆ తర్వాత టాబ్యులేషన్ నిర్వహించి మే 15న టెన్త్ ఫలితాలను వెల్లడించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు 4,84,384 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అయితే దీనిపై అధికారుల నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది.

తెలంగాణలో జూనియర్ కళాశాలల అకడమిక్ క్యాలెండర్ని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలు జూన్? 1న ప్రారంభమవుతాయిన బోర్డు అధికారులు ఏప్రిల్ 1న వెల్లడించారు. జూన్ 1 నుంచే తరగతులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ మేరకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక విద్యా క్యాలెండర్ బోర్డు వెలువరించింది. కటించిన క్యాలెండర్ ప్రకారం.. జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 19 నుంచి 25 వరకు దసరా సెలవులు, 2024, జనవరి 13 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. కాగా, ఇంటర్మీడియట్ విద్య కోసం ఈ ఏడాది మొత్తం 227 పని దినాలు ఉంటాయని బోర్డు తెలిపింది. ఇక ఫిబ్రవరి రెండో వారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. థియరీ పరీక్షలను మార్చి మొదటివారం నుంచి నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి వేసవి సెలవులు ఇవ్వనున్నారు.

# మిల్లర్ల నుంచి నాణ్యమైన బియ్యం కొనుగోలు

### అన్నప్రసాదం నాణ్యత మరింత పెంచేందుకు పాత విధానం ఆలోచన - టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి

**తిరుమల:**

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదాలు అందించడానికి మిల్లర్ల నుంచి నేరుగా బియ్యం కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నట్లు టీటీడీ ఈవో ఎ వి ధర్మారెడ్డి చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో మంగళవారం ఈవో, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, టీటీడీ అన్నప్రసాదాలకు, ఇతర అవసరాలకు 2013 నుండి 2019వ సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుండి నాణ్యమైన సోనా మసూర బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2019 లో ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు టెండర్ ద్వారా బియ్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా బియ్యం కొనుగోలు చేయడం వల్ల వ్యాపారస్తులు, మిల్లర్ల వద్ద కొని టీటీడీకి సరఫరా చేస్తున్నారన్నారు. టీటీడీ నేరుగా రైస్ మిల్లర్ల వద్ద కొనుగోలు చేయడం వలన మరింత నాణ్యమైన బియ్యం అందుతాయని ఆయన చెప్పారు. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అన్న ప్రసాదాలను మరింత రుచికరంగా అందించేందుకు తెలుగు రాష్ట్రాల్లోని రైస్ మిల్లర్ల తో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు వారం రోజుల్లో బియ్యం సరఫరా రేటు తెలియజేస్తామని చెప్పినట్లు తెలిపారు.

ఇటీవల టీటీడీ అన్నప్రసాదంలో బియ్యం బాగాలేవని భక్తుల నుండి ఫిర్యాదులు అందాయన్నారు. ప్రస్తుతం టెండర్ ద్వారా వ్యాపారస్తులు రూ.38 రూపాయలకు కేజి బియ్యం అందిస్తున్నారని ఈవో వివరించారు. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు రైతు సాధికార సంస్థ, ఏపి మార్క్ ఫెడ్లతో ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జేఈవో సదా భార్గవి, డిప్యూటీ ఈవోలు సెల్వం, పద్మావతి, జిఎం (కొనుగోలు) సుబ్రహ్మణ్యం జి ఎం ప్రొక్యూర్మెంట్, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి, ఇతర అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మామకు రూ.కోటి ఇన్సూరెన్స్

**హత్య చేసి ప్రమాదంగా**

**చిత్రీకరించిన కేసు**

**అల్లుడు తో పాటు మరో**

**ముద్దాయికి యావజ్జీవ కారాగార**

**శిక్ష, రూ. 11 లక్షల జరిమానా**

**బద్వేలు**

రూ. కోటి కి ఇన్సూరెన్స్ చేయించి సొంత మామను కిరాతకంగా హత్య చేసి రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని చిత్రీకరించే యత్నంలో ప్రత్యక్ష సాక్షులకు అడ్డంగా దొరికిపోయి నేరం నిర్ధారణ కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 11 లక్షల జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు లోని రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీ జి.ఎస్ రమేష్ కుమార్ తీర్పు ఇచ్చారు. రూ. 11 లక్షల జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో 8 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు.



కేసు వివరాలు.. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన యరమాల చెన్నకృష్ణారెడ్డి (59) కి సింహాద్రిపురం మండలం బలపనూరు కు చెందిన రాయపాటి కిరణ్ కుమార్ రెడ్డి (44) అల్లుడు. తన మామ చెన్నకృష్ణారెడ్డి కి రూ. కోటి మొత్తానికి ప్రమాద బీమా చేయించాడు. ఇందులో అత్త పేరు కాకుండా తన భార్య పేరు ను నామినీ గా ఉంచాడు. జనవరి 30, 2019 న మామ చెన్నకృష్ణారెడ్డి ని కారులో ఎక్కించుకుని ఎర్రగుంట్ల వైపు తనకు స్నేహితుడైన మల్లెం శ్రీనివాసుల రెడ్డి (44) తో కలిసి బయల్దేరారు. మార్గ మధ్యంలో కిరణ్ కుమార్ రెడ్డి, మల్లెం శ్రీనివాసుల రెడ్డి లు ఇద్దరూ కలిసి చెన్నకృష్ణా రెడ్డిని తీవ్రంగా కొట్టి చంపారు. శవాన్ని పోట్లదుర్తి సమీపంలో కారులో నుండి రోడ్డుపై విసిరేసి ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశారు. అయితే అటుగా వెళ్తున్న వాహనాలలో వారు గమనించి నిందితులు ఇద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మృతుడు భార్య యరమాల లక్ష్మీప్రసన్న ఫిర్యాదు మేరకు అప్పటి ఎర్రగుంట్ల అర్బన్ సి.ఐ బి.వి రమణ 302, 120(ఎ) తీ/వి 34 ఎఖఆ సెక్షన్ల క్రింద కేసు(17/2019) నమోదు చేసి సాక్షులను విచారించి ముద్దాయిలను అరెస్టు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను విచారించిన తర్వాత మంగళవారం ముద్దాయిలకు శిక్ష ఖరారు చేస్తూ రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.ఎస్ రమేష్ కుమార్ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించి ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాంప్రసాద్ రెడ్డి ని, ప్రస్తుత ఎర్రగుంట్ల అర్బన్ సి.ఐ మంజునాథ్ రెడ్డి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు, సిబ్బందిని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ అభినందించారు.

# ఈద్గా మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే భూమన

**తిరుపతి**

తిరుపతి నగరంలో రానున్న రంజాన్ సంధర్భంగా తిరుపతి శ్యాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం ఎస్వీ యూనివర్శిటి రహదారిలో వున్న ముస్లింల ప్రార్థనా స్థలం ఈద్గా మైదానాన్ని సందర్శించి ముస్లిం నాయకులతో సౌకర్యాలపై చర్చించారు. మైదానంలో వేసవికాలం కావున గతం కంటే ఎక్కువగా పందిళ్లు వేయించి కూలరులు, ఫ్యాన్లు, మంచి నీరు ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ముస్లిం పెద్దలతో మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ తరుపున రంజాన్ రోజు ప్రార్థనల కోసం వచ్చేవారికి



ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని హామి ఇచ్చారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటి సభ్యులు యస్.కె. బాబులు మాట్లాడుతూ గతంలో కంటే ముస్లింల ప్రార్థనలు చేసుకునే మైదానంలో ఎక్కడ రాజీ పడకుండా ఏర్పాట్లు చేయిస్తున్న ఎమ్మెల్యే భూమనకు ముస్లిం సోదరులు తరుపున హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు పాలగిరి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కార్పొరేటర్ కొటూరు ఆంజనేయులు, శానిటరి సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలకు సేద తీర్చే చలివేంద్రాలు

**కౌతాళం**



గ్రామ ప్రజలకు సేద తీర్చే చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని వారి దాహార్తిని తిరుస్తాయని గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రము లో ఎమ్మెల్యే సహకారంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా మండల నాయకులు దేశాయ్ ప్రహల్లాద్ ఆచారి చేతుల మీదుగా చలివేంద్రం వేంద్రము ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఎస్ఐ నరేంద్ర కుమార్, పంచాయతీ సెక్రెటరీ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ నవీన్ కుమార్, ఎంపీపీ బుజ్జీ స్వామి, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య,వడ్డే రామన్న,ఉమాపతి , మాజీ సర్పంచ్ అవతారం, చౌదరి బసవ, సమద్, మరియు పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలు పి.హెచ్.సిలో కరోనా కలకలం

**బద్వేలు**

బద్వేలు పట్టణంలో కరోనా కేసులు నమోదు అయ్యాయి.. బద్వేలు ప్రైమరీ హెల్త్ క్లీనిక్ లో పని చేస్తున్న ఓ డాక్టర్, హెడ్ నర్స్ తో పాటు లెప్రసీ ఆఫీసర్ కరోనా బారిన పడ్డారు. బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కరోనా కేసులు నమోదైనది వాస్తవమేనన్నారు. మొన్న ఒకరు, నిన్న ఇరువురు కరోనా బారిన పడ్డారన్నారు. రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు అవుతుండడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా కరోనా వైరస్ టెస్ట్ లు నిర్వహిస్తున్నామన్నారు. కరోనా వైరస్ మల్లీ వస్తోందని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి హాస్పిట్ లో కరోనా కిట్స్ ఉచితంగా ఇస్తున్నారన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి వున్న వారు కరోనా టెస్ట్ లు చేయించు కోవాలని సూపరింటెండెంట్ కోరారు. కరోనా వ్యాప్తి చెందుతోందంటూ ప్రజల్లో లేని పోబియో పెట్టడం సరికాదన్నారు.

## ఏఐటీయూసి ధర్నా

**కాకినాడ**

విశాఖ ఉక్కు పై యూటర్న్ తీసుకున్న కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపులో భాగంగా కాకినాడలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి టి.అన్నవరం ఆధ్వర్యంలో నిరసన ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 13వ తేదీన విశాఖ హుక్కు పై కేంద్ర సహాయ మంత్రి ఫగ్గిన్ సింగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని, ప్రైవేటీకరణ ముందు ఆర్ఎన్ఐఎల్ బలోపేతం చేస్తామని,పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని, వీటిపై ఆర్ఎన్ఐఎల్ లో యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని కుంటి సాకులు చెప్పిన కేంద్ర సహాయ మంత్రి ఫగ్గిన్ సింగ్ రాజీనామా చేయాలని, 24 గంటలు గడవక ముందే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పై యూ టర్న్ తీసుకోవడం ఆంధ్ర రాష్ట్ర ప్రజలను, కార్మిక, ఉద్యోగ సంఘాలను నమ్మించి మోసం చేస్తుందని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో ఎన్నికల్లో బిజెపికి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని, బిజెపికి మద్దతు తెలిపిన ఇతర పార్టీలను ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని, ఇది ఆంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బకొట్టే విధంగా బిజెపి మొండు వైఖరి ప్రదర్శిస్తుందని, ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రజా ప్రతినిధులు నోరు విప్పాలని, మీ పదవులకే అర్థం ఉండదని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ప్రజా కార్మిక సంఘాల ఉద్యమాలతో అడ్డుకుంటామని ప్రసాద్ అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యలపై తలపెట్టిన వారి దశల పోరాటానికి ఉద్యమానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ నారాయణ, రాజేష్, ఉలింగల వెంకన్న, పోతురాజు, నరసింహమూర్తి, దొడ్డు అర్జున్, పెంకి వీర అబ్బాయి, పెంకె ప్రసాద్, నారం దుల్లేశ్వరరావు, ప్రసాద్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు దొంగలు అరెస్టు

**కాకినాడ**

కాకినాడ జిల్లా గండేపల్లి పరిసర ప్రాంతాలలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను అరెస్ట్ చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పి ఎస్. సతీష్ కుమార్ వెల్లడించారు.కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలోని ఆయా పోలిస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 16 చోరీ కేసులకు సంబంధించి, 506 గ్రాముల బంగారం, 11వేల 850 కె.జి.ల వెండి, 7లక్షల రూపాయల నగదు, 2 లక్షల రూపాయలు విలువ గల విదేశీ కరెన్సీ నోట్లు, నాణాలను నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్వాధీనం చేసుకున్న చోరీసోత్తు విలువ 44లక్షల 7వందల రూపాయలు ఉంటుంద న్నారు. ఇద్దరు నిందితులు గతంలో నేర చరిత్ర కలిగి ఉన్నారన్నారు. ఈ మీడియా సమావేశంలో అడిషినల్ ఎస్పి పి.శ్రీనివాస్, ఎస్.బి. డి.ఎస్.పి. ఎం. అంబికాప్రసాద్, పెద్దాపురం డిఎస్పి ఎస్. మురళీమోహన్, కాకినాడ క్రైమ్ డిఎస్పి ఎస్.రాంబాబు, జగ్గంపేట సిఐ బి. సూర్యఅప్పారావు, ఎస్.ఐ. వై. గణేష్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## వేములవాడ రాజన్న ను దర్శించుకున్న భోగ శ్రావణి

**జగిత్యాల,**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ని మంగళవారం జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ప్రవీణ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా భోగ శ్రావణి- ప్రవీణ్ దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేద పండితులు ఆశీర్వాదించారు. అనంతరం వేములవాడ బీజేపీ పార్టీ కార్యాలయంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ను కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ బలోపేతానికి ఉమ్మడి జిల్లాలో అందరు కృషి చేయాలని ఆయన అన్నారు..ఈ కార్యక్రమంలో బీజేపీ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షులు సంతోష్ బాబు, కౌన్సిలర్ అన్నారం,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మైనారిటీల సంక్షేమమే బిఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

**రంజాన్ గిఫ్ట్'.. సర్కారు కానుక**

**బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు**

**యం.ఏ ఆరీఫ్**

**జగిత్యాల:**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కార్ ప్రతి ఏటా మైనార్టీలకు అందించే కానుకే 'రంజాన్ గిఫ్ట్' అని బిఆర్ఎస్ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ ఆరీఫ్, కౌన్సిలర్ పద్మ సింగరావు, పేర్కొన్నారు.రంజాన్ పండుగ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలోని జామాబాగ్ మజీద్ లో ముస్లింలకు రంజాన్ గిఫ్ట్ పంపిణీ చేశారు.. అనంతరం పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆరీఫ్ మాట్లాడుతూ ప్రతిఏటా రంజాన్ గిఫ్ట్ అందించడం ఆనందంగా ఉందని, కేసీఆర్ సర్కార్ అన్ని మతాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. రంజాన్ పండుగను ప్రతి కుటుంబము ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అమీన్ భాయ్, ఆర్ఐ ఖాజీం, రిజ్వాన్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ వి ఐ పి దర్శనాన్ని రద్దుచేయాలి: శివసేన డిమాండ్

**హైదరాబాద్ :**




సామాన్య భక్తులను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తిరుమల తిరుపతి దేవస్థానం వి ఐ పి దర్శనాన్ని రద్దుచేయాలని శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధన కార్య దర్శి ఏ సుదర్శన్ డిమాండ్ చేసారు.ఈ మారాకు మంగళవారం కాచి గూడా రైల్వే స్టేషన్ ఎదుట నిరసన ర్యాలి జరిపారు.ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ టీటీడీ సామాన్య భక్తులను ఇబ్బంది పాలు గురిచేస్తుందని, ఒకరోజు 40 గంటలు ఒకరోజు 30 గంటలు ఒక రోజు 20 గంటలు ఈ విధంగా సామాన్య భక్తులను ఇబ్బంది పాలు చేస్తున్నారని, టిటిడి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి సొంత నిర్ణయాలు తీసుకుంటూ సామాన్య భక్తులకు నరకం చూపిస్తున్నారని ఆయన విమర్శించారు.సామాన్య భక్తులైన కోటీశ్వరులు భక్తులైన అందరికీ ఒకటే విధానం ఉండాలి వి ఐ పి దర్శనం రద్దు చేయాలి మరియు ఎవరైనా సరే స్వామి దర్శనం చేసుకోవాలి అంటే అన్న ప్రసాదం ఖచ్చితంగా తీసుకోవాలి అప్పుడే స్వామివారి దర్శనం ఇవ్వాలి ఈ విధంగా చేస్తే సామాన్యులకు ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లోగణేష్ యువసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోపాల్ వికాస్ రాజు విశాల్ మనోజ్ దినేష్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణ కోసం తైక్వాండో

**కోరుట్ల,**

ఆత్మ రక్షణ కోసం తైక్వాండో వేసవి కాల శిక్షణ తరగతులు విద్యార్థిని లకు ఎంతో ఉపయోగపడతాయని ,వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిఆర్బీఎం కళాశాల ప్రిన్సిపాల్ పోతని ప్రవీణ్ కుమార్ అన్నారు. .మంగళవారంపట్టణంలోని ఐలాపూర్ రోడ్డులో గల ప్రముఖ తైక్వాండో శిక్షణ సంస్థ, తైక్వాండో క్లబ్ నిర్వాహకులు నావనంది రమేష్ మాస్టర్ తో రూపొందించిన తైక్వాండో సమ్మర్ క్యాంప్ కరపత్రాలను స్థానిక పిఆర్బీఎం కళాశాల ప్రిన్సిపాల్, రైజింగ్ స్కూల్ కరస్పాండెన్స్ పోతని ప్రవీణ్ కుమార్, కుడేల రాజేంద్రప్రసాద్ ల చేతుల మీదుగా ఆవిష్కరించారు..ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ మనిషి యొక్క శారీరక ,మానసిక ఆరోగ్యం దృఢత్వం తో పాటు ఆత్మ రక్షణ కోసం తైక్వాండో విద్య నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరం అన్నారు.ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల అనుగుణంగా ఆడపిల్లలు తప్పకుండా నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఆత్మరక్షణ విద్య, ఇటువంటి క్రమశిక్షణ గల మార్షల్ ఆర్ట్స్ విద్యను కోరుట్ల పట్టణంలో నేర్పిస్తున్న మాస్టర్ రమేష్ ను అభినందిస్తున్నామని అన్నారు.అనంతరం శిక్షకుడు నవనంది రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో పిల్లలకి, పెద్దలకి నెల రోజులపాటు ఉచితంగా తైక్వాండో శిక్షణను సమ్మర్ క్యాంపు ద్వారా అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అందరూ తప్పకుండా వినియోగించు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇల్లుటపు నర్సయ్య, కల్లెడ విజయ్, కొక్కుల రాజేష్ పాత్రికేయులు మీర్జా అలీ, ముజీబుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వీడియోగ్రాఫర్ మృతి

**వెంకటగిరి**

వెంకటగిరి గూడూరు రహదారిలో గొల్లపల్లి గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గూడూరు రెండో పట్టణ పరిధిలోని నాయుడు కాలువ కట్ట ప్రాంతానికి చెందిన. వీడియోగ్రాఫర్ ఎస్ గోపాల్ (28) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది . గోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .గూడూరు రూరల్ పోలీసుల సమాచారం మేరకు గోపాల్, గూడూరు పట్టణంలోని ఒక ఫోటో స్టూడియోలో వీడియో గ్రాఫర్ గా పనిచేస్తున్నారు.తిరుపతి జిల్లా బాలాయపల్లి గ్రామంలో జరిగిన ఒక శుభకార్యానికి వెళ్లి ఆ కార్యక్రమాన్ని వీడియో తీసిన అనంతరం గూడూరు పట్టణానికి చెందిన మరొక వ్యక్తితో కలిసి గోపాల్ మోటార్ సైకిల్ పై వస్తుండగా గూడూరు మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో మోటార్ సైకిల్ కు ముందు వెళ్తున్న ఎద్దల బండిని క్రాస్ చేస్తున్న తరుణంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయింది దేనితో తలకు తీవ్ర గాయమై గోపాల్ సంఘటనా స్థలంలో మృతిచెందగా అతనితో పాటు ఉన్న మరొక వ్యక్తికి ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు .

## 2.40 లక్షల కోట్ల ఆదాయంతో రైల్వే

**ముంబై :**

భారతీయ రైల్వే శాఖ లాభాల బాట పట్టింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.2.40 లక్షల కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. గత ఆర్థిక ఏడాది 2021-2022 ఏడాది కంటే ఇది 25 శాతం ఎక్కువగా ఆదాయం ఆర్జించింది. ఈ విషయాన్ని రైల్వేశాఖ సోమవారం ప్రకటనలో వెల్లడించింది. అలాగే మార్చి 31 తో ముగిసిన ఈ ఆర్థిక సంవత్సరంలో సరకు రవాణా ద్వారా రూ.1.62 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని పేర్కొంది. గత ఏడాది కంటే ఇది 15 శాతం వృద్ధి చెందిందని తెలిపింది.అలాగే ఈసారి ప్రయాణికుల నుంచి కూడా రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చినట్లు పేర్కొంది. గతేడాదితో పోలిస్తే 61 శాతం పెరగడంతో రూ.63 వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రకటించింది. గతంలో ఇంత భారీ స్థాయులో వృద్ధి ఎన్నడూ కనిపించలేదని తెలిపింది. నిర్వహణ వ్యయ నిష్పత్తి 98.14 శాతంగా నమోదైందని.. సవరించిన అంచనాలకు లోబడే ఉందని పేర్కొంది. ఆదాయం పెరగడం, నిర్వహణ వ్యయంపై దృష్టి సారించడం వల్లే ఇది సాధ్యమైనట్లు తెలిపింది. దాదాపు మూడేళ్ల తర్వాత పింఛను వ్యయాన్ని పూర్తిగా తమ ఆదాయం నుంచి సమకూర్చుకోగలినట్లు పేర్కొంది.

## జోరుగా కర్ణాటక ఎన్నికల ప్రచారం

**బెంగళూరు:**

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో సవాళ్ల పర్వం మరింత ముదిరింది. హేమాహేమీలు నామినేషన్లు దాఖలు చేశారు. కర్ణాటక పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ కనకపుర నియోజక వర్గంలో నామినేషన్ వేశారు. నామినేషన్ కంటే ముందు భారీ రోడ్‌షో నిర్వహించారు డీకే శివకుమార్ . వేలాదిమంది కార్యకర్తలు రోడ్‌షోలో పాల్గొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వస్తే డీకే శివకుమార్‌కు కచ్చితంగా సీఎం పదవి లభిస్తుందని ఆయన అభిమానులంటున్నారు.కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందన్నారు డీకే శివకుమార్. 150కి పైగా సీట్లలో గెలిచి కాంగ్రెస్ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. మాజీ సీఎం జగదీశ్ శెట్టార్ చేరికతో కాంగ్రెస్ మరింత బలోపేతం అయ్యిందన్నారు. చాలామంది బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్దంగా ఉన్నారని , కానీ వాళ్లందరికి టిక్కెట్లు ఇవ్వలేమన్నారు శివకుమార్.అధికార బీజేపీ కూడా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బెంగళూర్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు మంత్రి అశ్వథనారాయణ . కాంగ్రెస్ గెలుస్తుందని ఆ పార్టీ నేతలు పగటికలలు కంటున్నారని అన్నారు మంత్రి అశ్వథ నారాయణ. కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఉన్న 79 సీట్లు కూడా రావన్నారు. కచ్చితంగా బీజేపీ గెలుస్తుందని జోస్యం చెప్పారు.

## హర్యానాలో కూలిన భవనం.. నలుగురు మృతి

**ఛండీఘడ్ :**

ప్రమాదాలు ఎప్పుడు ఎలా వస్తాయో ఎవరూ అంచనా వేయలేరు. రోడ్డు ప్రమదాలు, అగ్నిప్రమాదాలు, విపత్తులు ఇలాంటి వాటి వల్ల కొంతమంది ఆయుష్షు నిండకుండానే ప్రాణాలు కోల్పోతారు. తాజాగా అలాంటి ఘటనే హర్యాణాలోని కర్నల్ జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం రోజున మూడు అంతస్థులు రైస్ మిల్ భవనం కూలిపోవడంతో నలుగురు వర్కర్లు అక్కడిక్కడే చనిపోయారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.ఆ రైస్?మిల్ లో పనిచేసే వందలాది కార్మికులు ఆ భవనంలోనే నిద్రపోయేవారు. అయితే మంగళవారం రోజున 150 మంది కార్మికులు ఆ భవనంలో ఉండగా అది ఒక్కసారిగా కుప్పకూలడం కలకలం రేపింది. ఆ భవనం శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులు అక్కడే ఇరుక్కుపోతామేమోనని భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, సహాయక బృందాలు ఘటన స్థలానకి చేరుకున్నారు. ప్రస్తుతం ఇంకా అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఆ భవన నిర్మాణంలో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించామని..ఘటనపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని పోలీసులు తెలిపారు. రైస్‌మిల్ యజమానుల పై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు

## అశ్లీల కంటెంట్ పై కేంద్రం సీరియస్

**న్యూఢిల్లీ,:**




మధ్య కొన్ని ఓటీటీల్లో సినిమాల్లో చూస్తున్నారా? కొన్నింట్లో అయితే డైలాగ్ డైలాగ్‌కీ బూతులు, సీన్ సీన్‌కి అశ్లీలం. ఇంట్లోనే కదా.. ఫ్యామిలీతో కూర్చుని ఓ సినిమా చూద్దాం అనే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితం పోటెత్తుతున్న ఫిర్యాదులు. అందుకే ఓటీటీల్లో అశ్లీల కంటెంట్ కన్నేసింది కేంద్రం. ఇకపై నా సినిమా నా ఇష్టం అంటే కుదిరేలా లేదు. మూడంచెల సెన్సార్‌కు సిద్ధమవుతోంది. ఓటీటీ ల్లోని అశ్లీల, అసభ్యకర కంటెంట్ నిషేధానికి కేంద్రం చర్యలు చేపడుతోంది. ఓటీటీ కంటెంట్‌పై కమ్యూనికేషన్స్ అండ్ ఐటీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశానికి సమాచార ప్రసార శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర సహా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. ఓటీటీ కంటెంట్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కన్నేసింది. ఓటీటీ వెబ్ సిరీస్‌లలో అశ్లీలం పెరిగిపోవడంపై కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటీటీల్లో పెరుగుతున్న అశ్లీలత, భారతీయ సంస్కృతిపై దుష్ప్రభావం చూపుతోందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.ఇక.. ఓటీటీ కంటెంట్ విషయంలో సోనీ లివ్‌పై 4063, అమెజాన్ ప్రైమ్ పై 3203, నెట్‌ఫ్లిక్స్ పై 401 ఫిర్యాదులు అందాయని కమిటీకి సమాచారం అందింది. డిస్నీ హాట్‌స్టార్ ఎలాంటి ఫిర్యాదులు స్వీకరించలేదని కమిటీ వెల్లడించింది. తదుపరి సమావేశంలో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్, సోనీ లివ్ వంటి పెద్ద ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను పిలిచి వారి స్టాండ్‌ను తెలుసుకోవాలని కమిటీ భావిస్తోంది. ప్లాట్‌ఫామ్‌లపై సెన్సార్‌షిప్ కానీ.. మరింత నియంత్రణ కానీ ఉండాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు ఓటీటీలు బహిరంగ వేదికలని కమిటీలోనున్న ప్రతిపక్ష ఎంపీలు వాదించారు. ఓటీటీ కంటెంట్ తమ మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తుందన్న ఎంపీల ప్రశ్నలకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారులు సమా ధానం ఇచ్చారు. ఫిర్యాదుల పరిష్కారానికి మూడంచెల వ్యవస్థను రూపొందించినట్టు వెల్లడించారు. మొదట ప్రచురణకర్త స్థాయిలో, తరువాత స్వీయ నియంత్రణ, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ స్థాయిలో నియంత్రణ ఉండేలా ఏర్పాట్లు చేశారు. మొత్తంగా.. ఓటీటీల్లోని అశ్లీల కంటెంట్‌కు చెక్ పెట్టడం ఖాయంగానే కనిపిస్తోంది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా గట్టిగా వాదిస్తున్న నేపథ్యంలో కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## ఫ్లై ఓవర్లపై ట్రాఫిక్ నిలిపివేత

**హైదరాబాద్:**

హైదరాబాద్‌లో దాదాపు అన్ని ఫ్లై ఓవర్లు మూతపడనున్నాయి. గ్రీన్‌ల్యాండ్ ఫ్లైఓవర్, పిఎన్‌విఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మరియు లంగర్ హౌస్ ఫ్లైఓవర్ మినహా నగరంలోని అన్ని ఫ్లై ఓవర్‌లు మంగళ వారం రాత్రి నుండి మూసివేయబడతాయి. 'షబ్-ఏ-ఖాదర్' జగ్నే కీ రాత్ సందర్భంగా రాత్రి 10 గంటల నుంచి ఫ్లై ఓవర్లపై ట్రాఫిక్‌ను నిలిపివేస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. అలాగే నెక్లెస్ రోడ్డు, పీవీఎన్ఆర్ రోడ్డులో వాహనదారులకు అనుమతి నిరాకరిస్తున్నట్లు తెలిపారు.ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ప్రజలు, వాహనదారులు ప్రకటన విడుదల చేశారు. ఏమైనా సమస్యలుంటే ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కు సంప్రదించాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా ఫ్లైఓవర్‌లను మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తమ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఆంక్షలను పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్లై ఓవర్లను మూసివేస్తున్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.'షబ్-ఎ-ఖదర్' సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలతో పాటు బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే గత కొన్నేళ్లుగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. కానీ చంద్రుని దర్శనం ప్రకారం, అమావాస్యను బట్టి ఏప్రిల్ 22 లేదా 23 తేదీల్లో రంజాన్ పండుగను జరుపుకునే అవకాశం ఉంది.పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారాన్ని ముస్లిం సోదరులు ఇస్లాంలో అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఆ రోజు రాత్రి జాగరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తారు.ఉప్పల్ స్టేడియంలో ముంబై వర్సెస్ సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వరంగల్ హైవే నుంచి వచ్చే వాహనాలను చెంగిచర్ల, చర్లపల్లి, ఎన్జీసీ వైపు మళ్లిస్తారు. ఐపీఎల్ మ్యాచ్‌ని చూసేందుకు భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు వచ్చే అవకాశం ఉంది. దీంతో మ్యాచ్ చూసేందుకు స్టేడియంకు వచ్చే అభిమానులతో రోడ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. అందులో భాగంగానే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మ్యాచ్ జరిగే రోజుల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు.

## బిడ్డను ప్రేమించాడని...మేనల్లుడికి విషం

**అదిలాబాద్:**

కుటుంబ బంధాలకు నేడు విలువ లేకుండా పోయింది. కన్న కొడుకుతో సమానంగా చూసుకోవాల్సిన మేనల్లుడిని మేనమామే దారుణంగా హతమార్చడం వినే వారికి షాక్ కలిగిస్తుంది. కూతురుని ప్రేమిస్తున్నాడన్న కారణంతో రక్త సంబంధాన్ని కూడా పట్టించుకోకుండా తండ్రి చేసిన పనికి సమాజమే నివ్వెరపోతుంది. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గ్రామంలో దారుణం జరిగింది. కూతురు ను ప్రేమించాడని కత్తితో బెదిరించి బీర్ లో గడ్డిమందు కలిపి త్రాగించి హత్యచేసిన మేనమామ విషయం వెలుగు లోకి వచ్చింది.గూడెం గ్రామానికి చెందిన దుడ్డంగుల అనిల్ (22) తన మేనమామ కూతురు ఇద్దరు ప్రేమించుకున్నారు. ఇది తెలిసిన అతని మేనమామ మాట్లాడేది ఉంది రమ్మని చెప్పి లక్సెట్టిపేట మున్సిపాలిటీ శివారులోని మోదెల చెట్ల సమీపంలో కత్తితో బెదిరించి గడ్డిమందు కలిపిన బీర్ త్రాగించాడు. అనిల్ స్పృహ తప్పగానే అనిల్ మేనమామ అక్కడి నుండి పరారయ్యాడు. స్పృహ కోల్పోయిన అనిల్ ను ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ జరిగిన విషయం చెప్పాడు. ఆ తరువాత చనిపోయాడు. ఇప్పుడు అనిల్ చనిపోకముందు మాట్లాడిన వీడియో సోషల్ మీడియా లో వైరల్ గా మారింది. ఇప్పటికే తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన లక్షెట్టి పేట పోలీసులు అనిల్ చనిపోయే ముందు వివరించిన వీడియో ఆధారంగా విచారణ జరుపుతున్నారు.

## మీ సమాధానమేంటి...

**విజయవాడ :**

తెలంగాణ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ.. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్ చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు ఎందుకు ఆచరించలేదు? అని ప్రశ్నించారు.. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలు వంచి ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తామన్న విషయం ఏమైంది? అని నిదీశారు.. విభజన చట్ట హామీల అమలు, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి నిధుల సంగతేమైంది?.. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు జరగలేదు?.. కేంద్రంపై ఒత్తిడి పెంచి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు ఆపలేకపోయారు?.. 'మాట తప్పి, మడమ తిప్పటం' తప్ప జగన్ ఈ నాలుగేళ్లలో ఏం సాధించారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు రామకృష్ణ..కాగా, ఏపీ మంత్రులపై మరోసారి ఫైర్ అయ్యారు తెలంగాణ మంత్రి హరీష్‌రావు.. నేను ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని తిట్టింది లేదు.. ఏం చేసింది లేదన్న ఆయన.. అయినా కొంత మంది నాయకులు ఎగిరిగిరి పడుతున్నారు అంటై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను ఏపీ ప్రజల పక్షాన మాట్లాడాను.. మీకు చేతనైతే ఏపీకి జాతీయ హోదా కోసం పోరాడండి, విశాఖ ఉక్కు కోసం పోరాడండి, పోలవరం ప్రాజెక్టుని పూర్తి చేసి మా కాళేశ్వరం లాగా నీళ్లు అందించి మాట్లాడండి అంటూ సవాల్ చేశారు. నేను మాట్లాడిన దాంట్లో తప్పు లేదన్న హరీష్‌రావు.. మా తెలంగాణ ఎంత గొప్పగా ఉందో పక్క రాష్ట్రాలతో పోల్చి చెప్పాను అంతే అని సోమవారం స్పష్టం చేసిన విషయం విదితమే.

# రామబాణం' థియేట్రికల్ ట్రైలర్ ఏప్రిల్ 20న రాజమండ్రిలో గ్రాండ్ విడుదల

'లక్ష్యం', 'లౌక్యం' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత మాచో స్టార్ గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన డింపుల్ హయతి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఐఫోన్, దరువెయ్యరా పాటలు చార్ట్ బస్టర్స్ గా అలరించాయి. తాజాగా మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఏప్రిల్ 20న రాజమండ్రిలో జరిగే గ్రాండ్ ఈవెంట్ లో రామబాణం ట్రైలర్ ని విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. ట్రైలర్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో ట్రెండీ అవుట్ ఫిట్ లో స్టయిలీష్ గా కనిపించారు గోపిచంద్. భూపతి రాజా ఈ చిత్రానికి కథను అందించగా, వెట్రి పళని స్వామి సినిమాటోగ్రఫీ, మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తున్నారు. మధుసూదన్ పడమటి డైలాగ్స్ అందించగా, ప్రవీణ్ పూడి ఎడిటర్ గా పనిచేస్తున్నారు.

జగపతి బాబు, ఖుష్బు ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడేకర్, నాజర్, అలీ, రాజా రవీంద్ర, వెన్నెల కిషోర్, సప్తగిరి, కాశీ విశ్వనాథ్, సత్య, గెటప్ శ్రీను, సమీర్, తరుణ్ అరోరా తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. మే 5న ఈ చిత్రం భారీస్థాయిలో విడుదల కానుంది.




# ఓజీ... సెట్స్ లో అడుగుపెట్టిన పవన్ కళ్యాణ్




పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా ప్రతిభగల యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో ఒక భారీ యాక్షన్ డ్రామాను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ సినిమా 'ఓజీ'(ఒరిజినల్ గ్యాంగ్ స్టర్)గా ప్రాచుర్యం పొందింది. జనవరి 30న పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో ఈ చిత్రం ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ప్రకటన వచ్చినప్పటి నుంచే పవన్ కళ్యాణ్ అభిమానులలో, సినీ ప్రియుల్లో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా షూటింగ్ లో పవన్ కళ్యాణ్ ఎప్పుడెప్పుడు పాల్గొంటారా అని అభిమానూలు, ప్రేక్షకులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఆరోజు రానే వచ్చింది. 'ఓజీ' సెట్స్ లో పవన్ కళ్యాణ్ అడుగుపెట్టారు. ఏప్రిల్ 15 నుంచి 'ఓజీ' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. తాజాగా ఈ మూవీ సెట్స్ లో పవన్ కళ్యాణ్ అడుగుపెట్టారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం ఉదయం మేకర్స్ ఒక ఫోటోను వదిలారు. అందులో బ్లాక్ హూడీ ధరించి, కళ్లద్దాలతో పవన్ కళ్యాణ్ చాలా స్టైల్ గా కనిపిస్తున్నారు. ఏప్రిల్ 15 నుంచి మొదలైన ఈ షెడ్యూల్ లో ముంబై మరియు పరిసర ప్రాంతాల్లో నెలాఖరు వరకు చిత్రీకరణ జరగనుంది. పవన్ కళ్యాణ్ తో పాటు ఇతర ముఖ్య నటీనటులు పాల్గొంటున్న ఈ షెడ్యూల్ లో యాక్షన్ సన్నివేశాలతో పాటు పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. భారీస్థాయిలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రవి కె చంద్రన్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ గా వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ ఫిల్మ్ 'భీమ్లా నాయక్'కి బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందించిన ఎస్ థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పవన్ కళ్యాణ్ బలానికి, స్టార్డమ్ కి సరిగ్గా సరిపోయే కథతో యాక్షన్ డ్రామాగా సుజీత్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం.. థమన్ అద్భుతమైన నేపథ్య సంగీతం మరియు అద్భుతమైన ఇతర సాంకేతిక వర్గం ప్రతిభ తోడై అటు యాక్షన్ ప్రియులను, ఇటు పవన్ కళ్యాణ్ అభిమానులను అలరిస్తుందని నిర్మాత డీవీవీ దానయ్య ఎంతో నమ్మకంగా ఉన్నారు.

# ఏప్రిల్ 23న 'వీరసింహారెడ్డి' వీర మాస్ బ్లాక్ బస్టర్ 100 డేస్ సెలబ్రేషన్స్

గాడ్ అఫ్ మాసెస్ నటసింహ నందమూరి బాలకృష్ణ, బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేనిల మాసీయస్ట్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'వీరసింహారెడ్డి' సంక్రాంతి కానుకగా విడుదలై వీర మాస్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీగా నిర్మించిన 'వీరసింహారెడ్డి' బాలకృష్ణ కెరీర్ లోనే హయ్యస్ట్ గ్రాసర్ గా రికార్డ్ క్రియేట్ చేసింది.

అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించిన 'వీరసింహారెడ్డి' చిత్రానికి వందరోజులు పూర్తికావస్తోంది. ఎనిమిది కేంద్రాలలో విజయవంతగా వందరోజులని పూర్తి చేసుకోనుంది. ఏప్రిల్ 23న వీరసింహారెడ్డి 'వీర మాస్ బ్లాక్ బస్టర్ 100 డేస్ సెలబ్రేషన్స్" ఈవెంట్ ని గ్రాండ్ గా





నిర్వహించనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ ఈవెంట్ కు చిత్ర బృందం అంతా హాజరుకాబోతుంది. ఈ రోజుల్లో సినిమా వందరోజులు ఆడటం అరుదైన విషయం. ఈ అరుదైన రికార్డ్ ని 'వీరసింహారెడ్డి' అందుకుంది.

# పుష్ప-2 ది రూల్ "హంట్ ఫర్ పుష్ప" కాన్సెప్ట్ వీడియో

పాన్ ఇండియా సార్ అల్లు అర్జున్ హీరోగా డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన చిత్రం పుష్ప. పుష్ప సినిమా రికార్డుల గురించి కలెక్షన్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పుష్ప సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులపై చూపించిన ఇంపాక్ట్ అంతా ఇంతా కాదు. పుష్ప రాజ్ అనే క్యారెక్టర్ ను అద్భుతంగా డిజైన్ చేసి ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు సుకుమార్. ఈ చిత్రాన్ని మైత్రి మూవీస్ ఇన్ అసోసియేట్ విత్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు.

పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటించిన తీరు, డైలాగ్ డెలివరీ, వాయిస్ మాడ్యులేషన్, యాటిట్యూడ్ ఇవన్నీ తెలుగు ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులందరికీ అద్భుతమైన ఎక్స్పీరియన్స్ ఇచ్చాయి. అప్పటివరకు తెలుగు, మలయాళ ప్రేక్షకులకు మాత్రమే సుపరిచితమైన అల్లు అర్జున్ పుష్ప సినిమాతో ప్రపంచవ్యాప్తంగా



ప్రేక్షకులందరికీ చేరువయ్యారు. పుష్ప సినిమా ఇంపాక్ట్ ఎంతలా ఉందంటే క్రికెటర్స్ రాజకీయ నాయకులు సినిమా ల్లోని డైలాగులు తమదైన స్టైల్ లో చెబుతూ సోషల్ మీడియాలో హల్చల్ చేశారు. పుష్ప-2 ది రూల్ చిత్రం రాబోతున్న సంగతి తెలిసిందే. రీసెంట్ గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా రీసెంట్ గా "పుష్ప: ది రూల్" చిత్రం యొక్క "హంట్ ఫర్ పుష్ప" అనే కాన్సప్ట్ వీడియో రిలీజ్ చేసింది చిత్రం బృందం. 3 నిమిషాల 17 సెకన్ల నిడివి ఉన్న ఈ "హంట్ ఫర్ పుష్ప" కాన్సెప్ట్ వీడియో గూస్ బమ్స్ తెప్పించి, సినిమా మీద అంచనాలను పెంచేసింది. పాన్ ఇండియా మూవీగా వస్తున్న ఈ కాన్సెప్ట్ వీడియో 100 మిలియన్స్ పైగా వ్యూస్ సాధించింది. 3.3 మిలియన్ లైక్స్ తో ఒక అరుదైన రికార్డ్ ను సృష్టించింది. మొత్తానికి పుష్ప తరహాలోనే "పుష్ప" ను మించి "పుష్ప: ది రూల్" ప్రకంపనలు సృష్టించనుంది.






Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950